

బుధవారం 4 మార్చి 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**వేట్లపాలెం దుర్ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు**

- వివరాలు 2 లో.



సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడితో భేటీ అయిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

2

# ఇంటింటికీ సురక్షిత తాగునీరు

**ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భేటీలో నిర్ణయం - వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన నేతలు**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై మూడురోజులపాటు నిర్వహించనున్న కుంభాభిషేక మహోత్సవానికి హాజరవ్వాలంటూ దుర్గగుడి పాలక మండలి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా ఆహ్వానించింది. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఆలయ అర్చకులు సహా కలిసిన పాలకమండలి.. దుర్గామల్లేశ్వర స్వామి తీర్థ ప్రసాదాలను అందించి.. ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందించారు.



## 'హనుమాన్'.. ఓ చారిత్రక అడుగు!

- మనుషులకీ వన్యప్రాణులకీ మధ్య సంఘర్షణ నివారణకు ఫౌండేషన్
- ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ హనుమాన్ ఫౌండేషన్ ప్రధాన కర్తవ్యం
- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ, జీవనోపాధి కల్పనకు చర్యలు
- ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

3



అవయవ దానంతో

## పునర్జన్మ..



- జాతీయస్థాయిలో రాష్ట్రానికి ఆరోస్థానం
- 2 నెలల్లోనే 64మందికి కొత్త జీవితం
- కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంతో మేలు
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

7

రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చిన

## జగన్ చర్యలు

- స్వప్రయోజనాలే ఆయనకు ముఖ్యం
- విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్



6

## ఫైనాన్స్ కమిషన్ నిధుల దుర్వినియోగానికి చెక్

- కూటమి వచ్చిన తరువాత చర్యలు
- గత ప్రభుత్వంలో వ్యయంపై కన్ను
- పాఠశాలలు, జనావాసాల మధ్యే బోర్లు
- నెలాఖరులోగా పనులు పూర్తికి ఆదేశాలు

7

*స్థానిక సంస్థలకు కేంద్రం విడుదలచేసే 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వం కన్నేసి ఉంచింది. నిర్దేశిత రంగాలకు చెందిన పనులకు మాత్రమే నిధులు వెచ్చించాలని స్పష్టం చేస్తూ.. గత వైసీపీ ప్రభుత్వహయాంలో సాగించిన దుబారా విధానానికి చెక్ పెట్టింది. తాగునీటి అవసరాలు తీరుస్తున్నామన్న సాకుతో.. సొంత స్థలాల్లో బోర్లు వేయించుకున్న ఘట్టాలు వైసీపీ హయాంలో సాగడం తెలిసిందే.*

అంగన్వాడీల సంక్షేమానికి

## కూటమి కట్టుబడే ఉంది

- రెండుసార్లు వేతనాలు పెంచింది చంద్రబాబే
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

6




- ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



4

*డిన్నర్ మీట్.. స్వీట్ మెమోరీస్. నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ ప్రజాప్రతినిధులకు మంగళవారం లోకేష్ ఇచ్చిన ఆత్మీయ విందు.. ఫ్యామిలీ పార్టీని మించిసాగింది. కుటుంబసభ్యుల సరదా సంభాషణలతో సందడే సందడి కనిపించింది. లోకేష్ చూపించిన ఆత్మీయ ఆతిథ్య మర్యాద.. ఆహూతుల మనసులను ఓలలాడించింది.*

చంద్రబాబుగారికి కృతజ్ఞతలు అంటోన్న దివ్యాంగులు





దివ్యాంగులకు ఏపీలో ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం

దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం 'ఇంద్ర ధనుస్సు' పేరిట 7 పథకాల అమలు

ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.6 వేలు పెంఛన్ ఇస్తున్న ప్రభుత్వం

మార్చి నెల లోపు దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు



చైతన్యరథం

# ఇంటింటికీ సురక్షిత తాగునీరు

**ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భేటీలో నిర్ణయం - వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన నేతలు**





అమరావతి (చైతన్య రథం): ఏపీలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరిలో వన్యప్రాణుల రక్షణకు ఉద్దేశించిన 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకున్న అనంతరం, ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సుమారు రెండు గంటలపాటు ఇద్దరిమధ్య సుదీర్ఘ భేటీ సాగింది. 'జల్ జీవన్ మిషన్' పురోగతిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రధానంగా చర్చించారు. గత ప్రభుత్వం కేంద్రం అందించే 'జల్ జీవన్ మిషన్' నిధులను దారిమళ్లించి, పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టేసిందని అభిప్రాయపడ్డారు. నిలిచిపోయిన తాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పునరుద్ధరించి, పనులను పట్టాలెక్కించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రోజుకు 55 లీటర్ల తలసరి నీటిని కూటమి ప్రభుత్వం అందజేయనుంది. ముఖ్యంగా టీటీడీకి సంబంధించి ప్రస్తుతం నెలకొన్న వివాదాలపై ఇద్దరూ సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి కేటాయించిన నిధులు, నియోజకవర్గాలవారీగా జరిగిన కేటాయింపులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్స్' పనుల గురించి సీఎంకు డిప్యూటీ సీఎం వివరించారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లు నిర్మించడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని ఇరువురు చర్చించారు. నీటిపారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత అంశాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. వేసవిలోనే పూడిక తీత పనులు చేపట్టి.. రైతులు పంటలు వేసేలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. అటవీశాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివరించారు.

## హోలీ సందర్భంగా సీఎం శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): హోలీ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "చెడుపై మంచి గెలుపునకు సూచికగా 'కామ దహనం'తో ప్రారంభమయ్యే హోలీ పండుగ మనందరి జీవితాల్లో కొత్త రంగులు అద్దుతుంది. హోలీ పండుగ సందర్భంగా బంధుమిత్రులతో, సాటివారితో ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. హోలీ పండుగ సందర్భంగా అందరికి మరొక్కమారు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## ఇదీ.. 'స్త్రీ శక్తి'!

అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు దశలవారీగా అమల్లోకి వస్తున్నాయి. అందులో ఒకటి –స్త్రీ శక్తి పథకం. ఈ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పించారు. అయితే, ఈ పథకం అమలుతో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతున్నట్టు అధ్యయనం వెల్లడిస్తోంది. ఈమేరకు ప్రకాశం జిల్లా పోలీసులు ఒక అధ్యయన నివేదికను రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం



జిల్లా ఉన్నతాధికారులతో ఈ అంశాన్ని వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య జిల్లాలో గణనీయంగా తగ్గిందంటూ సీఎం చంద్రబాబు దృష్టికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తీసుకెళ్లారు. స్త్రీ శక్తి పథకం అమలుకు ఆరునెలల ముందు, తర్వాత పోల్చుకుంటే.. 19 శాతం మేర మరణాలు తగ్గినట్టు జిల్లా పోలీసులు ఇచ్చిన నివేదికలో పొందుపర్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా అధ్యయనం చేయించాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గతంతో పోల్చుకుంటే ప్రకాశం జిల్లాలో10 శాతం మేర మరణాలు తగ్గినట్టు నివేదికలో వెల్లడైంది. దాంతో రోడ్డు ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేయాలంటూ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

## హోలీ శుభాకాంక్షలు: లోకేష్

అమరావతి (చైతన్య రథం): వసంత రుతువుకు స్వాగతం పలికే రంగుల సంబరమే హోలీ అని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. చెడుపై గెలిచిన మంచికి సంకేతమే హోలీ అన్నారు. హోలీ పండగ సందరంగా ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "సమత, మమతలకు చిహ్నంగా.. పేదా పెద్ద తారతమ్యాలు లేకుండా.. కులమత భేదాలు చూడకుండా.. రంగుల్లో అంతా కలిసిపోయి ఆనందాలను పంచుకునే హోలీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## దేశ రాజకీయాల్లో బాలయోగిది ప్రత్యేక ముద్ర: మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): లోక్‌సభ తొలి దళిత స్పీకర్, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ జీఎంసీ బాలయోగి వర్థంతి సందర్భంగా విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ నివాళి అర్పించారు. మంగళవారం ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "దళితులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జిఎంసి బాలయోగి అహర్నిశలూ కృషిచేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. దేశానికి, రాష్ట్రానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. కోనసీమ ముద్దుబిడ్డ బాలయోగి ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషిచేద్దాం" అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

## వేట్లపాలెం దుర్ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు

కాకినాడ (చైతన్య రథం): వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి 24మంది మరణించారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ రవికృష్ణ నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రమాద ఘటనకు బాధ్యులను గుర్తించాలని జారీచేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని ఆదేశించింది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో టపాసులు తయారు చేస్తుండగా ఆదివారం (ఫిబ్రవరి 28వ తేదీ) పేలుడు సంభవించింది. దీంతో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని 23మంది కార్మికులు సజీవదహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుడుధాటికి మృతదేహాలు.. స్థానిక పంట పొలాల్లోకి ఎగిరిపడ్డాయి. మరోవైపు పేలుడులో తీవ్రంగా గాయపడిన లోవరాజు అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య 24కి చేరింది. ఘటనలో గాయపడిన పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ప్రమాదం జరిగిన సమయంలో టపాసుల కేంద్రంలో 70మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మరణించిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. అలాగే గాయపడిన వారికి సైతం నగదును పరిహారంగా అందజేయనున్నట్లు వెల్లడించింది.

### ఆవుల చంద్రశేఖర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు : ఘనంగా సత్కరించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్ర అటవీ శాఖ సీనియర్ అధికారి, ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఆవుల చంద్రశేఖర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసా పత్రం,ఘనంగా సత్కారం అందుకున్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది "ఔషధ, సుగంధ మొక్కలు –ఆరోగ్యం–వారసత్వం –జీవనోపాధిని పెంపొందించడం" అనే అంశాన్ని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌నుంచి చంద్రశేఖర్ సత్కారం అందుకున్నారు.



# ‘హనుమాన్’.. ఓ చారిత్రక అడుగు!

- మనుషులకీ వన్యప్రాణులకీ మధ్య సంఘర్షణ నివారణకు ఫౌండేషన్
- ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ హనుమాన్ ఫౌండేషన్ ప్రధాన కర్తవ్యం
- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ, జీవనోపాధి కల్పనకు చర్యలు
- కట్టుదిట్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు
- విజయవంతంగా కుంకీ ఆపరేషన్స్
- ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



మంగళగిరి (చైతన్య రథం): “వసుదైక కుటుంబమనే ఉన్నత సిద్ధాంతాన్ని బలంగా నమ్మే దేశం మనది. సమస్త జీవకోటి, వన్యప్రాణులు ఇందులో అంతర్భాగం. మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యత, వన్యప్రాణుల సంరక్షణ అత్యంత ముఖ్యం. దీనిని దృష్టిలో పెట్టుకొనే అటవీ శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ ప్రాజెక్ట్ (హీలింగ్ అండ్ నర్చ్యూరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్‌నర్సింగ్ ఆఫ్ వైల్డ్ లైఫ్)ముందుకు తీసుకొచ్చాం” అని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇటీవలికాలంలో వన్య ప్రాణులవల్ల పంట, పశు సంపదకి నష్టంతోపాటు మావన భద్రతకు ముప్పు కలిగించే సంఘటనలు పెరుగుతున్నందున.. ఈ నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టామన్నారు.మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలి యన్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఉదయం హనుమాన్ పేరిట 100ప్రత్యేకర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలను పవన్‌కళ్యాణ్ ప్రారంభించారు. వీటిలో వన్య ప్రాణుల సంరక్షణతోపాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అంబులెన్స్,రెస్క్యూ వాహనాలున్నాయి. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇంఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ “హనుమాన్ ప్రాజెక్ట్ మానవ-వన్యప్రాణి మధ్యనున్న సంఘర్షణను నివారణకు రూపకల్పన చేసిన సమగ్ర సాంకేతిక, శాస్త్రీయ కార్యక్రమం. ఈ ప్రాజెక్టు ద్వారా అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ,జీవనోపాధికి భద్రత కల్పించడం, వన్యప్రాణుల సంరక్షణ చర్యలు మరింత కట్టుదిట్టంగా ముందుకు తీసుకువెళ్లబోతున్నాం. వన్యప్రాణులను సంరక్షిస్తూనే పంటలు, పశువులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ చేపట్టడం హనుమాన్ ప్రధాన కర్తవ్యం. ఏదైనా సంఘటన చోటుచేసుకున్నప్పుడు తక్షణ ప్రతిస్పందన, ఉపశమన చర్యలు, పరిహారం చెల్లింపు వ్యవస్థల్ని హనుమాన్ ఫౌండేషన్ నిర్వర్తిస్తుంది. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, పోలీస్ శాఖలతోపాటు ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ అటవీశాఖ హనుమాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తుంది” అని ప్రకటించారు.

## గ్రామస్థాయిలో ‘వజ్ర’ బృందాలను సిద్ధం చేస్తున్నాం

“ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్ రాష్ట్రంగా తీర్చి దిద్దడంలో భాగంగా తీసుకొచ్చిన హనుమాన్ ప్రాజెక్ట్ కోసం పూర్తిసాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించాం. అందులో 93ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలు కాగా, మరో 7వాహనాలు వన్య ప్రాణుల సంరక్షణతోపాటు వాటికి అవసరమైన వైద్య సాయం అందించేందుకు అవసరమైన అంబులెన్స్‌లు. వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్ర వరం, తిరుపతి, బైర్లుటిల్లో నాలుగు వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ్ ట్రీట్మెంట్ సెంటర్లు, 19ర్యాపిడ్ రెస్పాన్స్ బృం దాలు సిద్ధంగా ఉంచాం. ప్రతివాహనంలో అటవీ రేంజ్ ఆఫీసర్, జంతు వైద్యసిబ్బంది, ట్రైబల్ హెల్పర్స్ (గిరిజన), పారా వెటరేనియన్స్‌తో కూడిన పూర్తిస్థాయి వ్యవస్థ ఉంటుంది. గ్రామస్థాయిలో వన్య జీవి రక్షక్ (వజ్ర)లను అటవీశాఖ ఆధ్వర్యంలో సిద్ధంచేస్తున్నాం. వీరికి రెస్క్యూకిట్లు అందిస్తున్నాం. గ్రామస్థాయిలో పాములు, ఇతర జంతువుల నుంచి ఎదురయ్యే సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించే విధంగావారికి శిక్షణఇచ్చాం” అని వెల్లడించారు.

## పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాం

“కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ- వన్యప్రాణి సంఘర్షణలో జరిగిన నష్టానికి ఎప్పటికప్పుడు పరిహారంకూడా చెల్లిస్తున్నాం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఈ తరహా కేసులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,107వరకు నమోదు కాగా.. పరిహారం కింద దాదాపు రూ.4 కోట్లు చెల్లిం చాం. ఇది బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అందించిన భరోసా. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియా, నష్టపోయిన పంటలకు ఇచ్చే నష్టపరిహారం మొత్తాన్ని గణనీయం గా పెంచాం. జంతువుల దాడిలో మనిషి చనిపోతే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షలనుంచి రూ.10లక్షలకు పెంచాం. గాయపడిన వారికి ఇచ్చే పరిహారం రూ.2 లక్షలు చేశాం. పశువులు చనిపోతే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తున్నాం” అని పవన్ పేర్కొన్నారు.చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహ కారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ఇప్పటి వరకు 8 ఆపరేషన్స్ విజయవంతంగా పూర్తి చేసి ఏనుగుల బారినుంచి ప్రజలకు, పంటలకు రక్షణ కల్పించామని పవన్ కళ్యాణ్ వివరించారు.

## ఏఐ సాయంతో వన్యప్రాణుల కదలికల పర్యవేక్షణ

వన్యప్రాణుల కదలికల పర్యవేక్షణకు ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని, దీనిని పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించామని పవన్ పేర్కొన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో జంతువులు వచ్చేముందు ముందస్తు హెచ్చరికలు ఇచ్చే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వన్యప్రాణులవల్ల మానవ భద్రతకు ముప్పు కలగకుండా వసుదైక కుటుంబంలా కలిసి బతికే లక్ష్యంతో హనుమాన్ ప్రాజెక్ట్‌ను తెచ్చా మన్నారు.“ఈ ప్రాజెక్ట్ కోసం అటవీశాఖ అధికారులు, ఫ్రంట్‌లైన్ సిబ్బంది ఎంతో అంకితభావంతో కష్టపడి పని చేశారు. వారందరి సేవలను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను. అలాగే వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ, ఈస్టర్న్ ఘాట్స్ కన్జర్వేషన్ సోసైటీవంటి నిబద్ధతతో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రత్యేక అభినందనలు. కలిసి జీవిద్దాం. కలిసి అభివృద్ధి చెందుదాం” అని పవన్ పిలుపునిచ్చారు.

## 100కుపైగా హనుమాన్ వాహనాలు ప్రారంభం

పూర్తి అధునాతన సాంకేతికతతో రూపొందించిన 100కుపైగా హనుమాన్ వాహనాలను పవన్ కళ్యాణ్ జెండా ఊపి ప్రారంభించారు. హనుమాన్ డిజిటల్‌యాప్, అధునాతన సాంకేతికతతో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జిపిఎస్ ట్రాకింగ్ సిస్టంను ప్రారంభించారు. అంతకుముందు అటవీశాఖకు సంబంధించి వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన సిబ్బంది, సేవలు అందిస్తున్న ఎన్జీవోలకు పవన్ కళ్యాణ్ ప్రశంసా పత్రాలు అందించారు.

హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలను పవన్ ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పివి చలపతిరావు, అటవీశాఖ సలహాదారు పి మల్లికార్జునరావు, అటవీశాఖ ఐటీ సలహాదారు పి నాగేశ్వరరావు, అటవీశాఖ సలహాదారు అంకారావు, రాష్ట్ర మెడికల్ డెవలప్మెంట్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా, 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

















# డిన్నర్ మీట్.. స్వీట్ మెమోరీస్

## నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ ప్రజాప్రతినిధులకు లోకేష్ ఆత్మీయ విందు

## ఫ్యామిలీ పార్టీలో కుటుంబసభ్యుల సరదా సంభాషణలతో సందడే సందడి



ఉండవల్లి (చైతన్య రథం): ఉండవల్లి నివాసంలో ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్ల ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు మంత్రి నారా లోకేష్ మంగళవారం ఆతిథ్యమిచ్చిన డిన్నర్ మీట్ స్వీట్ మెమోరీస్‌తో సందడిగా సాగింది. ఒక్కో కుటుంబాన్ని లోకేష్ ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ పేరుపేరునా పలకరించారు. అతిథులు తనకు అందించిన దేవుని ప్రతిమలను చెప్పులుతీసి భక్తితో స్వీకరించారు. చిన్నపిల్లలను ఏం చదువుతున్నారని అడిగి, కాసేపు వారితో ఆటలాడారు. డిన్నర్ మీట్‌కు హాజరైన మహిళామూర్తులకు మంగళగిరి పట్టుచీరలు పెట్టి గౌరవించారు. ప్రజాప్రతినిధులు తనకిచ్చిన వినతులు ఏమేరకు పరిష్కరించానో, ఏవి పరిష్కారం కాలేదో కారణాలు వివరిస్తూ నివేదికను లోకేష్ ఆయా ప్రజాప్రతినిధులకు అందించారు.

ఆ ఆత్మీయ కలయికకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్ రావు (రాజ్యసభ), ఎమ్మెల్యేలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి (ఆత్మకూరు), మంత్రి పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ), డి కావ్య కృష్ణారెడ్డి (కావలి), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు), కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి (నెల్లూరు రూరల్), కాకర్ల సురేష్ (ఉదయగిరి), ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తిరుపతి పార్లమెంటు నుంచి ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్ (గూడూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), కురుగొండ్ల రామకృష్ణ (వెంకటగిరి), సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (సర్వేపల్లి), బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), ఆరని శ్రీనివాసులు (తిరుపతి) ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి కుటుంబసభ్యులతో హాజరయ్యారు.





















# విజయవాడ ఇంద్రకీలాద్రిపై కుంభాభిషేక మహోత్సవం

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఆహ్వానం



అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబును దుర్గగుడి పాలక మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనానాయక్ కలిశారు. దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరిగే కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించారు. ఈనెల 6 నుంచి 8 వరకు ఇంద్రకీలాద్రిపై కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రిని కలిసినసందర్భంగా స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమానికి మంత్రి నారా లోకేశ్‌ను పాలక మండలి ఆహ్వానించింది.



# ఉద్యమం.. కొత్త డ్రామా కాదా సజ్జలా?

రాయలసీమ లిఫ్ట ప్రాజెక్టు అంశాన్ని ప్రజా ఉద్యమంగా చేపడతామని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అనడం హాస్యాస్పదం. లిఫ్టుపై రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వైసీపీ నేతలతో సజ్జల టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి.. గ్రామస్థాయి నుండి సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తామనడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉంది. రాయలసీమ ప్రాజెక్టుల గురించి, ముఖ్యంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై సజ్జల చేస్తున్న వ్యాఖ్యలు మొసలి కన్నీరును తలపిస్తున్నాయి. ఐదేళ్లపాటు అధికారంలో ఉండీ.. సీమ గొంతెండుతున్నా పట్టించుకోని పట్టించుకోని మీ వైఖరి ప్రజలకు తెలీంది కాదు. ఇప్పుడు అధికారం పోగానే రాయలసీమ లిఫ్ట్‌పై ప్రజా ఉద్యమం చేపడతామనడం.. ప్రజలు తమవెంట పరుగులు తీస్తారనుకోవడం సజ్జల వెర్రితనం. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో సీమకు జరిగిన అన్యాయానికి సజ్జల ఏం సమాధానం చెబుతారు? అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వాటిని ఖర్చు చెయ్యకుండా దారిమళ్లించారు. కనీసం మెయింటెనెన్స్ కూడా పట్టించుకోకుండా సీమను ఎడారిగా మార్చారు. ఐదేళ్లూ సీమ పచ్చగా వెలిగిపోతోందంటూ గ్రాఫిక్స్ చూపిస్తూ రాజకీయ ప్రయోజనం పొందారు. అప్పుడులేని నీటి కష్టాలు, ఇప్పుడు అధికారం పోగానే పుట్టుకొచ్చాయా? గుర్తుకొచ్చాయా?

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే ఇచ్చినప్పుడుగానీ, పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పుడుగానీ మీ గొంతు గట్టిగా ఎందుకు వినిపించలేదు. ఇప్పుడు రాయలసీమ లిఫ్ట్‌పై ఉద్యమాలు చేస్తామనడం రాజకీయ అవకాశవాదం కాదా? అధికారముంటే ఒక నీతి, లేకుంటే మరో నీతా? చరిత్రను గమనిస్తే వైఎస్ కుటుంబానికి అధికారం లేనప్పుడే రాయలసీమ ప్రయోజనాలు గుర్తుకొస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీమకు అన్యాయం జరిగిపోతోందని, తామే రక్షకులమని సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందడం అలవాటుగా మారింది. సీమ ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనుకునే మీరు.. నేడు ప్రజలను రోడ్లమీదకు రమ్మని పిలవడం ఆత్మవంచన కాదా? రాయలసీమ ప్రజలు ఇప్పుడు అమాయకులు కాదు. అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ-నీవా, గాలేరు-నగరివంటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో సజ్జల సమాధానం చెప్పగలరా?.కృష్ణమ్మ నీటికోసం సీమ తల్లడిల్లుతుంటే, తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని అంతా బాగుందని ప్రచారం చేసిన వారే... ఇప్పుడు ఉద్యమమని అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. రాజకీయాల కోసం ప్రాజెక్టులను వాడుకోవడం తప్ప.. చిత్తశుద్ధితో సీమ కన్నీళ్లు తుడిచే ప్రయత్నం వైసీపీ అధికారంలో ఎప్పుడైనా జరిగిందా? గుక్కెడు నీరిచ్చే ప్రయత్నం ఎప్పుడైనా చేశారా? ఉద్యమానికి కదలాలంటూ సజ్జల చేసే రాజకీయ డ్రామా ప్రకటనలు కేవలం కేడర్‌లో ధైర్యం నింపడానికే, సీమ ప్రయోజనాల కోసమో, సీమమీది ప్రేమతోనో కానేకాదు.అధికారం ఉన్నప్పుడు సీమను పచ్చగా... అధికారం పోయాక ఎడారిగా సీమను వాడకోవడం వైఎస్ కుటుంబానికే చెల్లింది!

చరిత్రను గమనిస్తే -నీటి రాజకీయం వైఎస్ఆర్ హయాంలోనే మొదలైంది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాయలసీమ కోసం తెలుగు గంగ ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే.. మిగులు జలాల ఆధారంగాకాకుండా నికర జలాల ఆధారంగానే పథకాన్ని చేపట్టాలని వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో నానా యాగీ చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయినందున అదే నీటి రాజకీయాలకు జగన్‌రెడ్డి తెరలేపుతున్నాడు. రాయలసీమ ప్రజల దృష్టిలో చంద్రబాబును ద్రోహిగా చిత్రీకరించే జగన్‌రెడ్డి ఎత్తుగడలో ఇది భాగమేనని ప్రజలకు తెలియనిదా? రాయలసీమ హక్కుల పేరిట జల రాజకీయాలకు వైసీపీ తెరలేపింది.రాజకీయంగా కష్టం వచ్చినప్పుడల్లా రాయలసీమను ఒక రక్షణ కవచంగా వాడుకుంటోంది వైఎస్ కుటుంబం.రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టడం కోసం స్కెచ్ సిద్ధం చేస్తూనే.. మిగతా జిల్లాలలో కులాల కుంపట్లను రాజేయడం మొదలుపెట్టడం సహించరాని విషయం. ఆ కుటుంబం అధికారంలో లేనప్పుడే రాయలసీమకు అన్యాయం జరుగుతోందని, సీమ ఎడారి అవుతోందనీ ప్రచారం చెయ్యడం.. కొందరు కుహనా మేధావులకూ అలవాటుగా మారింది. ఎన్జీటీ ఆదేశాలవల్ల రాయలసీమ ఎత్తిపోతల పథకం-2020లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడే నిలిచిపోయింది. తర్వాత మూడేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పటికీ జగన్‌రెడ్డి దానిగురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోగానే.. మళ్లీ పథకం గుర్తుకొస్తోంది. అధికారంలో ఉన్నపుడు రాయలసీమ ప్రయోజనాలు వైసీపీకి పట్టలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజల ముందు పెట్టాలి. సీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా? ఒక్క ఎకరాన్నైనా అదనంగా సాగులోకి తెచ్చారా? సీమలో ఒక్క పరిశ్రమ తెచ్చారా? రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్లలో రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే.. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది నిజం కాదా? జీఓ నెంబర్ 365 ద్వారా 189 ప్రాజెక్ట్ పనులు రద్దు చేయగా.. అందులో 102 రాయలసీమ ప్రాజెక్ట్‌లు ఉన్న విషయం వాస్తవం కాదా? ఇంకా రాయలసీమపై కపట ప్రేమను చూపించడం మరింత ద్రోహం చేయ్యడం కాదా? వాస్తవంగా జగన్‌రెడ్డి హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోయింది. జగన్‌రెడ్డి హయాంలో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులలో తట్టెడు మట్టివేసిన దిక్కులేదు. ఎప్పుడో జగన్‌రెడ్డి హయాంలోనే నిర్మాణం ఆగిపోయిన రాయలసీమ ఎత్తిపోతలు పథకాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి కొత్తగా నిర్మాణం ఆపిందనడం రాజకీయంగా ముఖ్యమంత్రిపై బురద జల్లే కార్యక్రమమే తప్ప మరొకటి కాదు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం కాదు.. కేవలం చెన్నైతోపాటు సీమకి తాగునీటి కోసమని జీఓ విడుదల చేసిన పెద్దమనిషి.. నేడు సాగునీటి కోసం ఏర్పాటు చేశామని చెప్పడం గర్హనీయం. రాయలసీమ లిఫ్ట్ జగన్ దోపిడీకి ఏర్పాటైన మనీ లిఫ్ట్. ఆ ప్రాజెక్ట్‌లో 900 కోట్లు దోపిడీ జరిగినట్టు అభియోగాలు లేకపోలేదు. ఏదేమైనా చరిత్రను గమనిస్తే వైఎస్ కుటుంబానికి అధికారం లేనప్పుడే రాయలసీమ ప్రయోజనాలు గుర్తుకొస్తాయి. నీళ్ల రాజకీయం వైఎస్సార్ హయాం నుంచే మొదలైంది. ఇది చరిత్ర చెబుతున్న సత్యం.

**- నీరుకొండ ప్రసాద్**



# ఉద్యోగుల ఐక్యతే అభివృద్ధికి పునాది



- బీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- యాదవ ఎంప్లాయిస్ సొసైటీ
- నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

అమరావతి(చైతన్యరథం): యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతులమీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అమరావతిలో ఏపీ యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి నూతన భవన నిర్మాణం కోసం 30 సెంట్లు భూమి కేటాయించాలంటూ పల్లా శ్రీనివాస్ రావుకు సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఉద్యోగ స్థాయిలో మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా సమానంగా నిర్వర్తించడం ప్రతి ఉద్యోగి కర్తవ్యమన్నారు. సమాజ సమగ్రాభివృద్ధి కోసం ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారం అత్యంత అవస రమని సూచించారు. యువతకు మార్గనిర్దేశనం చేస్తూ విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సేవల్లో ఉన్న యాదవ ఉద్యోగులు పారదర్శకత, నిజాయితీ, సేవాభావంతో పనిచేస్తే సమాజానికి గౌరవం పెరుగుతుందని తెలిపారు. సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ప్రతిభా పురస్కా రాలు నిర్వహించడం ద్వారా కొత్త తరం ఉద్యోగులను ప్రోత్సహించాలని సూచించారు. బీసీల అభ్యున్నత, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏపీవైఈఎస్ ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షుడు దామినబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి కావేటి రమేష్ యాదవ్, సెక్రటేరియట్ ఎంప్లాయీస్ పెద్దలు అప్పారావు, రాఘవరావు, వివిధ శాఖల ఉద్యోగులు షణ్ముఖరావు, భాస్కర్, రజనీకాంత్, లక్ష్మణకుమార్, రమేశ్, రామకృష్ణ, ఈశ్వర్ తదిత రులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణంతో శ్రీవారి ఆలయం మూత

**టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి**



తిరుమల (చైతన్యరథం): చంద్ర గ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి ఆలయం మూసివేసినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. ఆలయ ద్వారాలు మూసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ క్యూలైన్‌లో ఉన్న ప్రతి భక్తుడికి దర్శనం చేయించి అనంతరం ఆలయ ద్వారాలు మూసివేసినట్లు చెప్పారు. ఆలయ మూత సమయంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసా ద కేంద్రం, లడ్డూ విక్రయ కేంద్రాలు కూడా మూసి వేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తులకు అన్ని చోట్ల పులిహోర ప్యాకె ట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. సాయంత్రం ఆలయ శుద్ధి, పుణ్యాహావచనం అనంతరం భక్తులను క్యూలైన్లలోకి అనుమతిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**తెరుచుకున్న ఆలయం**

గ్రహణం వీడిన అనంతరం తెరుచుకున్న శ్రీవారి ఆలయ ద్వారాలు.. ఆలయ శుద్ధి తర్వాత మంగళవారం రాత్రి 8:30 గంటలకు సర్వ దర్శనానికి భక్తులకు అనుమతించారు.

## అంగన్వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రెండుసార్లు వేతనాలు పెంచింది చంద్రబాబే
- వైసీపీ ప్రభుత్వం వారిని మోసగించింది
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): నియోజకవర్గంలో రూ.5.80 కోట్లతో ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణ పనులకు మంగళవారం జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అంగన్వాడీల 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. చరిత్రలో తొలిసారిగా అంగన్వాడీలకు రెండుసార్లు వేతనాలు పెంచిన ఘనత చంద్రబా బుదేనని తెలిపారు. 2014-19 గత టీడీపీ ప్రభుత్వంలో అంగ న్వాడీలకు 4500 నుంచి 10,500లకు జీతాలను పెంచి న్యాయం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.10,500 నుంచి రూ.11,500కు కేవలం రూ.1000 మాత్రమే పెంచి దగా మోసం చేసింది. కొత్తగా 5000 మంది సహాయకుల నియామకంతో పాటు మినీ కార్యకర్తలకు టీచర్ పదోన్నతి కల్పించాం. వేసవిలో అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు 15 రోజులు సెలవులు ఇస్తు న్నాం. రాష్ట్రంలో 58,204 మంది సిబ్బందికి రూ.75 కోట్లతో 5జి స్మార్ట్ ఫోన్లు అందజేశాం. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లింపుతో పాటు ఎన్నో ఏళ్లనాటి గ్రాట్యుటీ కల నెరవేర్చాం. 5 వేల మినీ అంగన్వాడీలను పూర్తిస్థాయికి అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ అప్పుల భారాన్ని మోపి వెళితే తట్టుకుని కూడా ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు.

# రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చిన జగన్ చర్యలు

- వ్యక్తి ప్రయోజనాలే ఆయనకు ముఖ్యం
- ఆయన పాలనలో విద్యుత్ శాఖకు భారీ నష్టం
- ఐటీ, ఏఐ పరిజ్ఞానంతో నేడు డిమాండ్ అంచనాలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీశాయని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఏ రాష్ట్రంలోనైనా అభివృద్ధి, పెట్టుబడులు, ప్రజల సంక్షేమం లక్ష్యంగా ప్రతి పక్ష పార్టీలు పని చేయాల్సి ఉంటుందని, కానీ జగన్ మాత్రం తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును అంధకా రంలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ శాఖకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లడమే కాకుండా రాష్ట్ర పారిశ్రామిక వాతావరణం కూడా పూర్తిగా దెబ్బతిన్నదని మండిపడ్డారు. ముఖ్యంగా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్ (పీపీఏ) రద్దు చేయడం ద్వారా పెట్టుబడిదారుల్లో తీవ్ర అభద్రతా భావాన్ని కలిగించారని, ఇది అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర గౌరవాన్ని తగ్గించిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడం సురక్షితం కాదం టూ కొన్ని విదేశీ సంస్థలు సాక్షాత్తూ భారత ప్రధాని కార్యాల యానికే ఫిర్యాదు చేసిన ఉదంతాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి వివాదాస్పద నిర్ణయాల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పరిహారంగా చెల్లించాల్సి వచ్చిందని, ఇన్ని తప్పిదాలు చేసిన జగన్ ఇప్పుడు మళ్ళీ పెట్టుబడుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మంత్రి గొట్టిపాటి వ్యాఖ్యానించారు. దేశ చరిత్రలో మొదటిసారిగా విద్యుత్ చార్జీలను ట్రూ డౌన్ చేసిన ఘనత నారా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశా రు. గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూనే.. ప్రజలపై భారం తగ్గించేలా నాణ్యమైన విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. గతంలో రాష్ట్రాన్ని వీడి వెళ్లిన పెట్టుబడిదారుల్లో తిరిగి నమ్మకాన్ని కలిగించేలా ప్రభుత్వం పారదర్శక విధానాలను అనుసరిస్తోందని వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ రంగాన్ని ఆధునీకరిస్తున్నామని, ఇందులో భాగంగా కృత్రిమ మేధ స్సు, ఐటీ సాంకేతికతలతో వాతావరణ పరిస్థితులను విశ్లేషించి విద్యుత్ డిమాండ్‌ను ముందే అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. బ్యాటరీ స్టోరేజ్, స్వాపింగ్ విధానం, పంప్డ్ స్టోరేజ్, పునరుత్పాదక ఇంధన వనరుల వంటి వినూత్న పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు.

# ప్రతిష్టాత్మకంగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్

- ఏసీఏ కార్యాలయంలో ఫ్రాంచైజీస్ ఓనర్స్ మీట్
- జూన్ 3 నుంచి సీజన్-5 మ్యాచ్‌లు
- విశాఖ, మంగళగిరి, కడప స్టేడియాల్లో నిర్వహణ
- మంగళగిరి స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు
- వివరాలు వెల్లడించిన ఏపీఎల్ చైర్మన్, అధ్యక్షుడు




విజయవాడ(చైతన్యరథం): ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్ -5ను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్న ట్టు ఏపీఎల్ జనరల్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు తెలిపారు. విజయవాడ పటమటలోని ఆంధ్ర క్రికెటర్ అసోసియే షన్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఏపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్స్ మీట్ ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజన్‌లో పాల్గొననున్న 7 జట్ల ఓనర్స్ హాజరై ఏపీఎల్ సీజన్-5 నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎపీఎల్ ఫ్రాంచైజీస్ ఓన ర్స్ మీట్ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఏపీఎల్ జనరల్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణరంగరావు మాట్లాడుతూ గత సీజన్ కంటే భిన్నంగా, ఘనంగా ఏపీఎల్ సీజన్-5 ఉంటుంది. గత సీజన్ వరకు మ్యాచ్‌లు విశాఖప ట్నానికి మాత్రమే పరిమితం కాగా..ఈ సీజన్‌లో విశాఖతో పాటుగా మంగ ళగిరి, కడప స్టేడియాలలో సైతం మ్యాచ్‌లు జరుగుతాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఏపీఎల్ సీజన్ -5 మ్యాచ్‌లు నిర్వహించేందుకు సహకరించిన ఆంధ్రా క్రికెట్ అసోసియే షన్‌కు ధన్యవాదాలు. ఈ సీజన్-5లో మ్యాచ్‌లు జరిగేందుకు వీలుగా రూ.35 కోట్లతో మంగళగిరి స్టేడియాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వివ రించారు. మ్యాచులు జరిగే ప్రతి స్టేడియంలోనూ వేలాది మంది కూర్చుని మ్యాచ్‌లను చూసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ బలపడటానికి ఏపీఎల్ దోహదపడుతుందని తెలిపారు. క్రీడాకారులకు మేలు జరిగేలా క్రీడాకారుల ఆక్షన్ అమౌంట్‌ను కూడా రూ.45 లక్షల నుంచి రూ.55 లక్షలకు పెంచడం జరిగిందని వివరించారు. గతసారి కంటే ముందుగానే ఈ దఫా సీజన్ ప్రారంభం అవుతుందని, సీజన్-5 మ్యాచ్‌లు జూన్‌లో ఉంటాయని వివరించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ ( చిన్ని) మాట్లాడుతూ ఏపీఎల్ ప్రభావం ఈసారి రాష్ట్రవ్యాప్తంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రానున్న కాలంలో ఏపీఎల్ ప్రధాన కార్యాలయం మంగళగిరి క్రికెట్ స్టేడియం కేంద్రంగా పని చేస్తుందని తెలిపారు. ఏపీఎల్ సీజన్ మ్యాచ్‌ల నిర్వహణకు మం గళగిరి స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దు తున్నామని, రెండు నెలల వ్యవధిలో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తా మని వివరించారు. బెంగళూరు తరహాలో విజయవాడ మూల పాడు స్టేడియాన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నా మని చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు మాట్లాడుతూ సీజన్‌లో పాల్గొనే క్రీడాకారుల ఆక్షన్ ఏప్రిల్ 25న ఉంటుంది. జూన్ 3న తొలి మ్యాచ్ మంగళగిరిలో జరుగుతుంది. జూన్ 28న విశాఖపట్నంలో ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. ఈసారి డొమెస్టిక్ జిల్లా మ్యాచులను రెండు నెలలు ముందుగానే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి ఏపీఎల్‌లో నితీష్‌రెడ్డి వంటి వారు కూడా ఓ జట్టులో ఆడతారని తెలిపారు. సమావేశంలో భీమవరం బుల్స్ టీం ఓనర్ కె.శివనాథ్, ఐసీఏ సభ్యులు వైయస్.రంగనాథ్, ఏసీఏ కౌన్సిలర్ విష్ణుదంత్, తుంగభద్ర వారియర్స్, క్యాపిటల్ అమరా వతి రాయల్స్, భీమవరం బుల్స్, విజయవాడ సన్ షైనర్స్, కాకి నాడ కింగ్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్, రాయల్స్ ఆఫ్ రాయ లసీమ యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవయవ దానంతో పునర్జన్మ..

- రాష్ట్రానికి జాతీయస్థాయిలో ఆరో స్థానం
- 2 నెలల్లోనే 64 మందికి కొత్త జీవితం
- గతంతో పోల్చుకుంటే పెరుగుతున్న స్పందన
- వెయిటింగ్‌లో 50 ఏళ్ల లోపు వారే అత్యధికం
- కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంతో మేలు
- ప్రభుత్వాసుపత్రుల్లోనూ శస్త్ర చికిత్సలు పెరగాలి
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్
- జీవన్‌దాన్ కార్యకలాపాలపై సమీక్ష

అమరావతి (చైతన్యరథం): అవయవాల దానంలో భారతదే శంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అపెక్స్ బాడీ) రాష్ట్రాల వారీగా అవయవ దాన జాబితా-2025ను ప్రకటించింది. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్‌దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమా లు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుంది. ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ వైద్య ఆరోగ్య, జీవన్‌దాన్ ట్రస్ట్ అధికారులతో మంగళవారం సమీక్షించా రు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు . ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జీజీహెచ్, కర్నూలు జీజీహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిమ్స్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్-తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జీజీహెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, వైయస్సార్ కడప,తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, ఇతర




ఆసు పత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయ వాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు విశాఖ లోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్త సంబంధీకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారు లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు.

### పెరుగుతున్న ఔదార్యం

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు.. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసు లు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనమని సత్యకుమార్ తెలి పారు. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే.. 2024లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయని వివరించారు. ఈ ఏడాది మరింతగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు స్వీకరించి అవయవాలు కోసం ఎదురుచూస్తున్న బాధితులకు భరోసా కల్పించేందుకు కృషి చేయాలని జీవన్‌దాన్ సమన్వయకర్తలకు, స్వచ్ఛంద సేవా సంస్థల కు మంత్రి సూచించారు.

### 1,200 మంది బాధితులకు నూతన జీవితాలు

రాష్ట్రంలో అవయవాలు ఆయుష్షు నిండి ఎదురుచూస్తున్న 1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్‌దాన్ నూతన జీవితాలను ప్రసాదించింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాల ను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపింది. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్‌దాన్ సృష్టించింది అని సత్యకుమార్ పేర్కొన్నారు.

### అవయవాల కోసం 5,000 మంది ఎదురుచూపులు

రాష్ట్రంలో 20-50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువమంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు. ట్రస్టులో ఇప్పటివరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికం గా యువకులే ఉండటం గమనార్హం. ఉత్పాదక వయసులోనే అవ యవ వైఫల్యంతో చిక్కి శల్యమవుతుండటంతో వారి వ్యక్తిగత జీవితంలోనే గాక సామాజికంగానూ తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0-09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని తెలిపారు.

### కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేదానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయి. అలాగే రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకు మార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ.లక్ష వరకు పెంచే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి చెక్

- కూటమి వచ్చిన తరువాత బ్రేక్
- గత ప్రభుత్వంలో వ్యయంపై కన్ను
- పాఠశాలలు, జనావాసాల మధ్యే బోర్లు
- నెలాఖరులోగా పనులు పూర్తికి ఆదేశాలు

విశాఖపట్నం(చైతన్యరథం): స్థానిక సంస్థలకు కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచింది. నిర్దేశిత రంగాలకు చెందిన పనులకు మాత్రమే ఆ నిధులు వెచ్చించాలని ఇప్పటికే స్పష్టంచేసింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు, వారి అనుయాయులకు చెందిన వ్యవసాయ క్షేత్రాలు, పశువులశాలలు, ప్రధానంగా కల్లాల్లో బోర్లు నిర్మా ణానికి నిధులు మంజూరు చేసుకున్నారు. ఆ విధంగా నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. తాగునీటి అవస రాలు తీర్చడం అంటే ప్రజల నివాసాల మధ్య బోర్లు నిర్మించాలి. ఆ నిబంధనను ఉల్లంఘించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిపై ఆంక్షలు విధించింది. దీంతో జడ్పీ సాధారణ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావే శాల్లో పలువురు సభ్యులు కల్లాల్లో బోర్లు మంజూరు చేయాలని కోరినా అధికారులు తిరస్కరించారు. కేంద్రం మంజూరు చేసిన 15వ ప్రస్తుత ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను నెలాఖ రులోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులను



ఉన్నతాధికారులు ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1311.1 లక్షలతో ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 358 పనులు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా విశాఖ జిల్లాలో రూ.116 లక్షలతో 17 పనులు, అనకాపల్లి జిల్లాలో రూ.272.6 లక్షలతో 63 పనులు, అల్లూరి జిల్లాలో రూ.216 లక్షలతో 54 పనులు చేపట్టారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా విశాఖ జిల్లాలో రూ.137 లక్షలతో 42, అనకాపల్లి జిల్లాలో రూ.421.4 లక్షలతో 140 పనులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.146.6 లక్షల తో 42 పనులు మంజూరుచేశారు. రెండు విభాగాల్లో ఇప్పటి వరకూ 168 పనులు పూర్తిచేయగా, మరో 160 పనులు పురోగతి లో ఉన్నాయి. మరో 30 పనులు ఇంతవరకూ ప్రారంభం కాలేదు.

జిల్లా పరిషత్‌కు వచ్చే సాధారణ నిధుల నుంచి రూ.955.58 లక్షలతో 228 పనులు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ ఇంజనీ రింగ్ పరిధిలో విశాఖ జిల్లాలో రూ.176.75 లక్షలతో 19 పను లు, అనకాపల్లి జిల్లాలో రూ.228.98 లక్షలతో 58, అల్లూరి సీతా రామరాజు జిల్లాలో రూ.164.6 లక్షలతో 40 పనులు మంజూరు చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో రూ.90.1 లక్షలతో 23, అనకాపల్లి జిల్లాలో 157.95 లక్షలతో 53, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.136.68 లక్షలతో 35 పనులు మంజూరుచేశారు. ఇప్పటివరకూ రెండు విభాగాల్లో కలిపి 65 పనులు పూర్తికాగా, 151 పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 12 ఇంతవరకూ ప్రారంభించలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో సామాజిక భవనాలు, పాఠశాలలు, జనావాసాల మధ్య, ఇంకా పంచాయతీల ఆధ్వర్యంలో నడుస్తున్న మంచినీటి పథకాలకు అవసరమని గుర్తించిన చోట మాత్రమే బోర్లు వేయాలని అధికా రులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే జడ్పీ సాధారణ నిధు లను పంచాయతీలు నిర్వహించే తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులు, గ్రామాలు, మండలాల మధ్య రోడ్ల అనుసంధానా నికి మాత్రమే వెచ్చించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశిం చారు. ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టే పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈలను ఆదేశించారు.

# ప్రజల హృదయాల్లో బాలయోగి సజీవం

***లోక్‌సభ స్పీకర్‌గా ఆయన సేవలు మరువలేనివి - టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘన నివాళులు***

మంగళగిరి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత నేత జి.ఎం.సి. బాలయోగి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్.రాజశేఖర్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, ఎన్నారై విభాగం రాజ శేఖర్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు పర్చూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరలు పాల్గొన్నారు. బాలయో గి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. భారత పార్లమెంటరీ వ్యవస్థలో బాలయోగి పోషించిన పాత్ర, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ఎమ్మెల్యే ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం నుంచే కాకుండా, భారతదేశ చరిత్రలోనే



లోక్‌సభ స్పీకర్ స్థాయి కి ఎదిగి సభా మర్యాదలను కాపాడటంలో బాలయోగి అందిం చిన సేవలు ఎప్పటికీ మరువలేం. పార్లమెంట్‌లో ఆయన చూపిన సమయస్ఫూర్తి, హుందాతనం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన సహాయ సహకారాలు, నిధులను తీసుకురావడంలో విశేష కృషి చేశారు. రాష్ట్ర ప్రయో జనాల కోసం ఆయన నిరంతరం తపించేవారని గుర్తు చేసుకు న్నారు. బాలయోగి పార్టీలో అత్యంత క్రమశిక్షణ కలిగిన నాయ కుడిగా పేరు తెచ్చుకున్నారని..చంద్రబాబుకు ఆయన అత్యంత ప్రీతిపాత్రమైన, నమ్మకస్థుడైన నాయకుడిగా ఉండేవారని పేర్కొ న్నారు. ఎస్సీ సామాజికవర్గం నుంచి వచ్చి అత్యున్నత స్పీకర్ స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం బడుగు, బలహీన వర్గాలకు గర్వకారణం. బాలయోగి ఆశయాలు, విలువలను తెలుగుదేశం పార్టీ తూచా తప్పకుండా పాటిస్తుందని తెలిపారు.

# పట్టాదారు పాసు పుస్తకాలతో రైతులకు మేలు

- వారి హక్కులను సంరక్షిస్తున్నాం
- వైసీపీ భూములు కాజేసే ప్రయత్నం చేసింది
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె(చైతన్యరథం): నియోజకవర్గంలో జ్వాలాపురం గ్రామంలో రైతన్నలకు మంగళవారం నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరిగింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పట్టాదారు పాసుపుస్తకాలు తప్పుల తడకగా మార్చి రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. చంద్రబాబు నాయకత్వంలో "రాజముద్ర"తో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీతో రైతన్నల హక్కులను సంరక్షిస్తున్నాం. అన్నదాతలకు ఇచ్చిన మాట కు కట్టుబడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి రైతన్నల హక్కులను పరిరక్షించాం. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూసమస్యలు లేకుండా చేయడం మా కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరిట రైతుల భూముల్లో అనేక అక్రమాలకు పాల్పడిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చూడని



విధంగా మన పూర్వీకుల ఆస్తులపై జగన్‌రెడ్డి బొమ్మ వేసుకు న్నాడని మండిపడ్డారు. నాటి రీసర్వే తప్పులను సరిదిద్ది నేడు పట్టాదారు పాస్ బుక్ లపై రాజముద్ర వేసి రైతుల హక్కులు కాపాడుతున్నామని వివరించారు. నేడు ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాల్లో ఏవైనా తప్పులు ఉంటే అధికారులు దృష్టికి తీసు కువస్తే పరిష్కరిస్తున్నాం. అన్ని ఆధారాలు ఉంటే 22 ఏ భూములను కూడా ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి తొల గిస్తుందని తెలిపారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా దద్దనాల లిఫ్ట్ ఇరిగేషన్‌ను సీఎంకు చెప్పి రూ.23 కోట్లతో తీసుకొచ్చాం. గత ప్రభుత్వంలో దద్దనాలను పూర్తిగా అటకె క్కించింది. తిరిగి అధికారం చేపట్టాక సొంత నిధులు రూ.27లక్షలతో మరమ్మతులు చేపట్టామని తెలిపారు.

**కార్పెంటర్ కాలనీ వాసులకు న్యాయం చేస్తాం**

బనగానపల్లెలోని జుర్రేరు వాగులో అక్రమంగా నిర్మించిన కార్పెంటర్ కాలనీని ఆర్ అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీ లించారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్ర మంలో భాగంగా కార్పెంటర్ కాలనీవాసుల కోసం అను వైన స్థల ఎంపిక కోసం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్, ఆర్డీవో నరేంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దారు నారాయణ రెడ్డితో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. కార్పెంటర్ కాలనీవాసు లకు భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా ఉండేందుకు ప్రత్యామ్నా య స్థలాన్ని చూశారు. నదీ గర్భంలో ఆక్రమణలపై సుప్రీంకోర్టు తీర్పులు కఠిన తరంగా ఉన్న క్రమంలో మంత్రి సూచనల మేర కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

# చిన్నారుల చూపు కాపాడిన 108 సిబ్బంది

- తక్షణ వైద్య సహాయంతో క్షేమం
- విజయనగరంలో హోలీ వేడుకల్లో ఘటన




విజయనగరం (చైతన్యరథం): పట్టణంలో హోలీ వేడుకల సంద ర్భంగా జరిగిన ఒక ఘటనలో నాలుగు మంది చిన్నారుల కళ్లలో రంగులు పడటంతో వారు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తక్షణ ప్రాథమిక చికిత్స అందించారు. సమయానికి స్పందించి కళ్లను శుభ్రపరచడం, అవసరమైన ప్రాథమిక వైద్య సహాయం అందించడం వల్ల తీవ్రమైన ప్రమాదం తప్పింది. అనంతరం చిన్నారులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మరింత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల ప్రకారం, తక్షణ చికిత్స అందడంతో చూపుకు ఎటువంటి శాశ్వత నష్టం కలగ కుండా కాపాడగలిగారు. ఈ సందర్భంగా 108 అత్యవసర వైద్య సేవల సిబ్బంది అప్రమత్తత, వేగవంతమైన స్పందన ప్రశంసనీ యమని స్థానిక ప్రజలు అభినందించారు. హోలీ వంటి పండుగల సందర్భంగా రసాయన పదార్థాలు కలిగిన రంగులు ఉపయోగించ కుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు, అధికారులు సూచించారు.

# నక్కపల్లికి ఆర్సెలార్ మిట్టల్ ప్రతినిధులు

- స్టీల్ ప్లాంట్ భూమిపూజ ఏర్పాట్లు పరిశీలన
- మౌలిక వసతుల పనులపై సంతృప్తి
- అనకాపల్లిలో కలెక్టర్, జేసీలతో భేటీ



అనకాపల్లి (చైతన్యరథం): నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న 'ఆర్సెలార్ మిట్టల్– నిప్పన్ స్టీల్' (ఏఎంఎన్ఎస్)కు భూమిపూజ కార్యక్రమానికి వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం .2,200 ఎకరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఏఎంఎన్ఎస్ సీఈఓ దిలీప్ ఓమెన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం నక్కపల్లి మండలంలో కంపెనీకి కేటాయించిన భూములను, అక్కడ జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. అనంతరం అనకాపల్లి కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమాన్ పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్టీల్ ప్లాంట్ భూమి పూజకు జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో చర్చించా రు. భూ సమీకరణ, రహదారుల నిర్మాణం, ప్రాజెక్టుకు అవస రమైన నీటి సరఫరా కోసం జరుగుతున్న పైపులైన్ ఏర్పాటు పనులు, పునరావస కాలనీల అభివృద్ధి, ప్రభావిత కుటుంబాల తరలింపుపై చర్చించారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ లేదా సీఎం చంద్రబాబు వస్తారని, ఇందుకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టాలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ వారికి సూచించారు. ఏఎంఎన్ఎస్ ప్రతినిధుల బృందంలో ప్రాజెక్టు చీఫ్ కేవల్ చౌదరి, హెచ్‌ఆర్ డైరెక్టర్ అశితోష్ తెలియాంగ్, అడ్మిన్ హెడ్ కెప్టెన్ దీపక్ పట్నాయక్, హెచ్‌ఆర్ అడ్మిన్ డీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించింది

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి(చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారు ల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా విస్మరించిందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిప డ్డారు. సంతబొమ్మాళి మండలం గొలుగువాని పేట గ్రామాని చెందిన గొర్లె రామారావు ఇటీవల సముద్రంలో వేటచేస్తూ ప్రమా దవశాత్తూ జరిగిన ఘటనలో మరణించగా.. ఆ కుటుంబానికి స్థానిక ఎన్టీఆర్ భవనలో రూ.5 లక్షలు సాయాన్ని అందజేసి మాట్లాడారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో అనేక సంక్షేమ ప థకాలు అందించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సాయం అందజేశామని వెల్లడిం చారు. పీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా టెక్కలి నియోజ కవర్గంలో ఇప్పటివరకు 300 మందికి రూ.3 కోట్లు సాయంగా అందించామని తెలిపారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన 22 మందికి రూ.19 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అనారోగ్యం ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వం అండగా ఉం టుందన్నారు. త్వరలోనే ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు వైద్య బీ మా వర్తించేలా చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కళిం గ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరివరప్రసాద్, టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణ మూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెలమల విజయలక్ష్మి, నాయకులు కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, సాసుమంతు అనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ నుంచి వర్చువల్‌గా 'ప్రజాదర్బార్'

- సమస్యలు తెలుసుకున్న రామ్మోహన్‌నాయుడు
- ఆన్‌లైన్‌లోనే వినతుల స్వీకరణ




శ్రీకాకుళం(చైతన్యరథం): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రజా సమస్యల పరిష్కారంలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సొంత జిల్లావాసుల కష్టాలు తీర్చేందుకు సాంకేతికతను జోడించి సరికొత్త విధానాన్ని తెరపైకి తెచ్చారు. వర్చువల్(వీడియో కాన్ఫరెన్స్) విధానంలో ప్రజాదర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. అటు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమం గా తీసుకొచ్చేందుకు ఆ దేశాల్లో రాయబార కార్యాలయాల్లో ప్రతినిధులతో మాట్లాడుతూనే ఉన్నారు. మరోవైపు శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న కేంద్రమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా ప్రజలు తమ వినతులను అందించగా.. ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడా రు. అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా వినతుల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. సామాన్యుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు ఈ ఆన్‌లైన్ గ్రీవెన్స్ ఎంతో దోహ దపడుతుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఈ ఆన్‌లైన్ గ్రీవెన్స్ సెంట ర్లను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్ల డించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

రాయచోటి(చైతన్యరథం): చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లిలో మంత్రి మండిపల్లి స్వగృహంలో ప్రజాదర్బార్ జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రిని సత్కరించారు



# సీఎంఆర్ఎఫ్ నుంచి విరివిగా ఆర్థిక సాయం

**●విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో 21 మందికి చెక్కులు అందజేసిన ఎంపీ ఎం.శ్రీభరత్**



విశాఖపట్నం (చైతన్యరథం): పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఆర్థిక ఇబ్బందులు అవరోధం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వ సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ స్పష్టం చేశారు. విశాఖ బీచ్ రోడ్‌లోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద ధరకాస్తు చేసుకున్న 21 మంది లబ్ధిదారులకు, మొత్తం 22 లక్షల81వేల 516 రూపాయల చెక్కులకు అందజేశారు. ఈసందర్భంగా విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ జోడించి ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లబ్ధిపొందిన వారు సంపూర్ణ ఆరోగ్యవంతులై మంచి జీవితాన్ని పొందాలని ఆకాంక్షించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలాంటి జాప్యం లేకుండా అనతికాలంలోనే చెక్కులు విడుదల చేయడం తమకెంతో ఆనందంగా వుందని, ఇది కూటమి ప్రభుత్వానికి పేదల పట్ల వున్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.

# కూటమి ప్రభుత్వాన్ని ఓటేసి ఆశీర్వదించండి

**● పాలకొల్లులో రూ.4.30 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డుకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన**



పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం ప్రధాన అజెండాగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఎన్నికల్లోను ఓటు వేసి ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. పాలకొల్లు మండలం రూరల్ గ్రామపంచాయతీ పరిధి నాగరాజ్ పేటలో రూ.4.30 కోట్లతో నాగరాజుపేట - వెంకటాపురం ఆర్అండ్‌బి రోడ్డుకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... 2014-19 టీడీపీ ప్రభుత్వంలోను, మళ్లీ కూటమి ప్రభుత్వంలోనూ పాలకొల్లు నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగిందని, గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకుడిని గుర్తించాలే గాని ఎటువంటి అభివృద్ధి చేయని వైసీపీకి 30శాతం ఓటు వేసిన ప్రతి ఒక్కరు ఎందుకు వేసేమా అని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకొల్లు రూరల్ గ్రామపంచాయతీలోనే 10కోట్ల వరకు అభివృద్ధి పనులు జరిగితే వైసీపీ ప్రభుత్వంలో రూపాయి పని జరగలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ, వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో ప్రజలు ఒకసారి ఆలోచన చేయాలన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పాలకొల్లు రూరల్‌తో పాటు మరో ఆరు గ్రామాలను ప్రభుత్వ పటంలో నుంచే తీసేసినందున అటు పంచాయతీరాజ్ శాఖ, ఇటు మునిసిపాలిటీ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పరుగులు పెడుతుందని, అందులో భాగంగానే 2.50 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు ఇంటింటికి సురక్షిత తాగునీరు అందించేందుకు 60 కోట్లతో తాగునీటి పథకం పనులకు, రోడ్లు డ్రైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గ్రామానికి వెళ్లే మొదట్లో నర్సాపురం ప్రధానకాలపై 12 కోట్లతో వంతెన నిర్మాణానికి ఈనెలాగోలాగా శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. నాగరాజుపేట వంతెన, ఎర్ర వంతెనలకు 25 లక్షలతో మరమత్తు పనులు చేపడుతున్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకుడ్ని, పనిచేయని ప్రభుత్వాన్ని నాయకుడిని ఒకే లాగా చూడకూడదని మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని మరో 15 ఏళ్లపాటు కొనసాగేలా దీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**● మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు**



అమరావతి/ ఇచ్ఛాపురం (చైతన్యరథం): నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకరించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు వ్యాఖ్యానించారు. మంగళవారం ఉండవల్లిలోని నారా లోకేష్‌ను బెందాళం అశోక్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని, ప్రధాన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వంశధార, బహుద - నదులు అనుసంధానం చేసి ఇచ్ఛాపురం నియోజకవర్గం సాగునీరు ఇప్పించి, ప్రధానంగా రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించి సాధ్య.సాధ్యులను పరిశీలిస్తానని.. నారా లోకేష్ హామీ ఇచ్చారని బెందాళం అశోక్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు సీపాన వెంకటరమణ, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుల్లట రాజు, మాజీ ధూపన సూర్యనారాయణ రెడ్డి, సంతోష్ జిన్నెల, ప్రియా నర్సింగరావు, మురిపాల ధర్మా యాదవ్, సాలిన జగదీష్, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# మీ రక్షణ... సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**●ముస్లిం మైనారిటీలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ముస్లిం మైనారిటీల రక్షణ... సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం కోసం మెయిన్ రోడ్డులోని చిన్న మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై ముస్లిం మైనారిటీ పెద్దలు ఛాన్ బాషా, అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా తదితర ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల రక్షణకు, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మసీదులు, ఈద్గాలు, కబర్స్థాన్ల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ముస్లింల అభివృద్ధికి ఎప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధి, విద్య, ఆర్థిక పురోగతికి ప్రత్యేక పథకాలు అమలు చేయనుందని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ సోదరభావంతో కలిసి ఉండాలని పిలుపునిచ్చారు. మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం అని, తమ జీవిత సౌదాల్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింపజేసుకునేందుకు ఉపయోగపడే సాధనమే ఉపవాస వ్రత పరమార్ధమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పార్వతీపురంలో హెూలీ వేడుకలు



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా కేంద్రంలో పట్టణ యూత్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే విజయ్ చంద్ర హోలీ వేడుకలను ప్రారంభించారు. ముందుగా క్యాంప్ ఆఫీసు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ప్రభాకర్ రెడ్డిని కలిసి అక్కడ రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డికి శు భాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణ ప్రజలకు హోలీ శు భాకాంక్షలు తెలియజేస్తూ సందడి చేశారు. ఐక్యతకు అభిమానానికి హోలీ వేదికని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు రవికుమార్ కౌన్సిలర్లు నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

**● పి.నైనవరం గ్రామంలో రైతులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏపీ రీ-సర్వే ప్రాజెక్టులో భాగంగా నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేవలం తన ప్రచారం కోసం రైతుల పాస్ పుస్తకాలపై తన ఫోటోను ముద్రించుకున్నారని, అది ఆయన చేసిన పెద్ద తప్పని మండిపడ్డారు. 19 మంది ముఖ్యమంత్రులు, చివరకు బ్రిటీష్ కాలంలో భూ హక్కుల కోసం కృషి చేసిన థామస్ మన్రో లాంటి వారికి కూడా రాని ఇటువంటి దిక్కుమాలిన ఆలోచన జగన్ రెడ్డికి వచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ తప్పును సరిదిద్దుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం మేరకు తిరిగి ప్రభుత్వ రాజముద్ర మరియు వెనుక భాగంలో తెలుగు తల్లి చిత్రంతో కూడిన గౌరవప్రదమైన పాస్ పుస్తకాలను అందిస్తోందని తెలిపారు. పి.నైనవరం గ్రామంలో మొత్తం 467 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రస్తుతానికి 455 మందికి భూ సరిహద్దుల మ్యాప్‌లతో కూడిన కొత్త పుస్తకాలు పంపిణీ చేశామని అన్నారు. మిగిలిన రైతులకు కూడా రీ-సర్వే పూర్తి చేసి త్వరలోనే అందిస్తామన్నారు. విజయవాడ రూరల్ పరిధిలోని 9 గ్రామాల కోసం రామవరప్పాడులో సర్కిల్ కార్యాలయం కోసం ఒక ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డీసీపీ, ఎంఆర్‌ఓలను కోరానని, స్థలం గుర్తింపు కాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలోని 9 గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వీటిని విజయవాడ నగరపాలక సంస్థలో విలీనం చేయడం ఒక్కటే మార్గమని, ఆ దిశగా కచ్చితంగా అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**●నాయకులు, కార్యకర్తలు ప్రజల మన్ననలు పొందాలి : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



దెందులూరు (చైతన్యరథం): "రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని, క్షేత్రస్థాయి, గ్రామస్థాయిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజల సంక్షేమానికి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతూ ప్రజల వద్ద మన్ననలు, అభిమానాలు అందుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. మంగళవారం దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో జల్జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.55 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న నూతన ఓవర్హెడ్ రిజర్వాయర్ సిస్టం (వాటర్ ట్యాంక్) నిర్మాణ పనులకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధిలో పునర్నిర్మాణానికి అంకితం అవుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్నారు. తుది దశకు చేరుకున్న ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ పథకం ద్వారా పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లోని పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అండగా నిలిచే విధంగా కూడా స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు కృషి చేయాలని తెలిపారు. గత ఇదేనా వైసీపీ ప్రభుత్వంలో అధ్వాన్నంగా మారిన రహదారులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన పలు రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేసేందుకు కృషి చేసామని, రాబోయే రోజుల్లో గ్రామాల్లోని అంతర్గత రహదారులు కూడా నిర్మించే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, ప్రభుత్వ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



ఏలూరు (చైతన్యరథం): ఏలూరు ఎఫ్‌సిఐ గోదాముల వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన స్థానిక బిడి కాలనీకి చెందిన బొంతు దుర్గాప్రసాద్, షేక్ అహ్మద్, చిట్టి ఆంజనేయులు భౌతిక కాయాలను టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సందర్శించారు. ఏలూరులోని ప్రభుత్వాసుపత్రి మార్చురీ వద్ద ఉంచిన వారి మృతదేహాలకు ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఇదే సమయంలో అక్కడ గుండెలవిసేలా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ముగ్గురి కుటుంబాల సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చంటి... వారిని ఓదార్చారు. వారి కుటుంబాల వివరాలను పూర్తిగా తెలుసుకున్నారు. వారి పరిస్థితిని చూసి చలించిపోయిన ఎమ్మెల్యే బడేటి చంటి,,, అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా కల్పించడమే కాకుండా తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి 10వేల రూపాయలను అందించి, వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్ మరియు వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా లోకసభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతి

**● ఆదర్శన నేతకు నివాళులర్పించిన పలువురు నేతలు... ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు**



అమలాపురం (చైతన్యరథం): కోనసీమ అభివృద్ధి పథంలో నడిపించిన లోకసభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 24 వ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పట్టణంలోని నల్లవంతెన సమీపంలోని బాలయోగి ఘాట్‌లో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఎంపీ హరీష్ బాలయోగి నివాసంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమం ముగించుకున్న అనంతరం నివాసం వద్ద నుండి ఎంపీ హరీష్ ర్యాలీగా ఘాట్‌కు చేరుకున్నారు. ఘాట్‌లోని బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**నివాళులు అర్పించిన పలువురు నేతలు...**

జీఎంసీ బాలయోగి వర్ధంతిని పురాషరించుకుని అమలాపురంలోని బాలయోగి ఘాట్ లో పలువురు నేతలు మాట్లాడుతూ బాలయోగి దేశానికి మరియు కోనసీమకు చేసిన సేవలను గుర్తుచేశారు. ఘాట్‌లో నివాళులు అర్పించిన వారిలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, రాజోలు టీడీపీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య, మాజీ ఎమ్మెల్యేలు చెల్లి వివేకానంద, చిల్లా జగదీశ్వరి, అయ్యాజీ వేమా, అల్లాడ సోంబాబు, మార్కెట్ కమిటీ చైర్మెన్ లు చిట్టూరి శ్రీవాస్, కేతా లక్ష్మి, చిక్కాల గణేష్, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మట్టపర్తి భారతి, భాజపా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, నల్లా పవన్, కల్వకోలను తాతాజీ, ఏడిద శ్రీను, మోకా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

**ఉచిత మెగా వైద్య శిబిరం...**

రాజమండ్రి కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ వారిచే ఎంపీ హరీష్ బాలయోగి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. సుమారు 600 వందల మంది వరకూ ప్రముఖ వైద్య నిపుణులచే గుండె మరియు నరాల సమస్యలు, ఎముకలు మరియు మోకాళ్ల నొప్పులు, శ్వాస సంబంధిత సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలు, కంటి పరీక్షలు, పిల్లల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ECHO, ECG, BP మరియు షుగర్ వంటి పరీక్షలు అక్కడే చేశారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.



# జీ.ఎం.సి బాలయోగికి వనమాడి ఘన నివాళి

●బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి



కాకినాడ (చైతన్యరథం): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు, లోక్‌సభ తొలి దళిత స్పీకర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గంటి మోహన చంద్ర బాలయోగి వర్ధంతి సందర్భంగా మంగళవారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, స్టేట్ పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వనపర్తి బద్రి,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు తదితరులు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కొండబాబు, చిక్కాల రామచంద్రరావు, పెంకే శ్రీనివాస్ బాబా, కొల్లాబత్తుల అప్పారావు, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు అంబటి సత్యనారాయణ (చిన్న) మీడియాతో మాట్లాడుతూ బాలయోగి విశేష సేవలను స్మరించుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా యెదురులంకలో ఒక సామాన్య దళిత రైతు కుటుంబంలో జన్మించిన బాలయోగి.. కాకినాడలోనే న్యాయవాద వృత్తిని ప్రారంభించి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా, తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యేగా, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖా మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

# వినూత్న సేవా స్ఫూర్తితో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి జన్మదినోత్సవం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఈ నెల 15వ తేదీన రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం ఆయన నివాసంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో క్యాడర్ వెల్ఫేర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్వయంగా ప్రారంభించారు. పార్టీ శ్రేణుల ఆరోగ్య పరిరక్షణ తనకు అత్యంత ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశంపార్టీ కమిటీ సభ్యులు, యువ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, ఐటీడీపీ సభ్యులు, మహిళా కమిటీలు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులకు పూర్తిస్థాయి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ ఆధ్వర్యంలో వైద్య బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ గోరంట్ల రవి రామ్‌కిరణ్ మాట్లాడుతూ... పార్టీ కేడర్ ఆరోగ్యం సంక్షేమంపై ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎప్పుడూ ఆలోచనలు చేస్తారని. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారని తెలిపారు. అందుకే ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని ముందస్తుగా ఆయనకు అత్యంత ఇష్టమైన ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే ఈ పరీక్షలు చేయించుకున్న వారికి రిపోర్టుల ఆధారంగా తమ జిఎస్ఆర్ హాస్పిటల్‌లో మొదటిసారి ఉచితంగా ఓపి ఉంటుందని, ఆ తర్వాత ప్రత్యేక రాయితీ ధరలో ఉంటుందని. అలానే సంవత్సరానికి ఒక్కసారి ఉచితంగా రక్త పరీక్షలు చేసి అందుకు అనుగుణంగా సలహా ఇవ్వడంతో పాటు తమ కమిటీ ప్రతి ఒక్కరి ఆరోగ్య స్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తారని తెలిపారు.

# ఇది కూటమి పాలన... అనారోగ్యానికి భయపడాల్సిన అవసరం లేదు

గుంటూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరూ అనారోగ్యానికి భయపడే పరిస్థితి లేదని చెప్పడానికి గర్వపడుతున్నామని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.40 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు స్థానిక మా కార్యాలయంలో పంపిణీ చేశాం. కేవలం 18 నెలల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సీఎం సహాయనిధి ద్వారా రూ.9.67 కోట్ల విలువైన చెక్కులను అందించాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాం. పేదలకు వైద్యం అందలేదనే పరిస్థితి రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాం రాష్ట్రంలో విద్య వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూనే సంక్షేమం , అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం. రాష్ట్రంలో గూగుల్ వంటి పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టడం ద్వారా నిరుద్యోగ యువత భవితకు బంగారు బాటలు వేస్తున్నాం. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

◆ జిళ్ళెళ్ళమూడిలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



బాపట్ల (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వంలో నాటి పాలకులు ఇష్టానుసారంగా భూములు దోచుకుని, రెవెన్యూ వ్యవస్థను పూర్తిస్థాయిలో భ్రష్టుపట్టించారని, నాటి పాలకులు తప్పిదాలను సరిదిద్ది రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తోందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వ్యాఖ్యానించారు. మంగళవారం జిళ్ళెళ్ళమూడిలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రతి రైతుకు తన భూమిపై పూర్తి హక్కులు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారిక ముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకాలు అత్యంత ప్రామాణికమైనవని, వీటి ద్వారా రైతులకు బ్యాంక్ రుణాలు మరియు ఇతర ప్రభుత్వ పథకాలు పొందడం సులభతరమవుతుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో సేవలందించాలని అధికారులను ఆదేశించారు. గతంలో భూ రికార్డుల విషయంలో రైతులు పడ్డ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రీ-సర్వేను పూర్తి చేసిందని ఆయన తెలిపారు. రాజముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకాలు రైతులకు పూర్తిస్థాయి భద్రతను ఇస్తాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జరిగిన ఈ సర్వే వల్ల సరిహద్దు వివాదాలకు తావుండదని, రైతులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే తమ సంకల్పమని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. రెవెన్యూ యంత్రాంగం నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో ఉన్న చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దశాబ్దాల కాలంగా తమ భూములకు సంబంధించి ఎదురుచూస్తున్న స్పష్టత ఇప్పుడు లభించిందని జిళ్ళెళ్ళమూడి గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

◆గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక మహిళా గ్రీవెన్స్



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వినిపించారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాల కేటాయింపులు, టిడ్కో ఇళ్ల పంపిణీ మరియు నిర్మాణ సమస్యలు, అలాగే తమ నివాస ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్రంగా వివరించిన వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి సమస్యను విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత, గృహ సమస్యల పరిష్కారం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మహిళల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యాల్లో ఒకటని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, పార్టీ కార్యాలయం ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## మహిళలకు ఆదాయం, నైపుణ్యం, పర్యావరణ పరిరక్షణపై శిక్షణ

విజయవాడ (చైతన్యరథం): ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో, కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదు ఎన్.ఐ.ఆర్.డి లో ఐదు రోజుల 12వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కొనసాగుతోంది. మంగళవారం రెండో రోజు శిక్షణ తరగతులు కొనసాగాయి.. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 45 మంది ఎస్.హెచ్.జి మహిళలు మష్రూమ్స్ పెంపకం, హోమ్ బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ పొందుతున్నారు. ఈ రెండో రోజు శిక్షణలో మహిళలు మష్రూమ్స్ పెంపకం, హోమ్ బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీ ఉత్పత్తుల ద్వారా ఆదాయ మార్గాలు, పర్యావరణ పరిరక్షణ అంశాలతోపాటు వాటికి సంబంధించిన నైపుణ్యాలు అభివృద్ధి చేసుకున్నారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

# మహిళలకు ఆర్థిక స్వావలంబనకు పునాది వేసిందే చంద్రబాబు

● కెడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.4కోట్ల రుణాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, నెట్టెం రఘురాం



విజయవాడ (చైతన్యరథం): ఏపీఐఐసీ కాలనీ, కోగంటి రామ తులసమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కెడీసీసీ బ్యాంక్) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, రైతులకు మొత్తం రూ.4 కోట్ల రుణాలను మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం మరియు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రఘురాం మాట్లాడుతూ... రెడ్డిగూడెం, శీలక్ష్మీపురం, వెల్లటూరు ప్రాంతాల్లో మూడు కొత్త బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం గ్రామీణ ప్రజలకు పెద్ద వరమని, ఇకపై రైతులు, మహిళలు నగరాలకు వెళ్లకుండా తమ గ్రామాల్లోనే బ్యాంకింగ్ సేవలు పొందగలరని తెలిపారు. సహకార రంగాన్ని గ్రామాల దాకా విస్తరించడం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. డ్వాక్రా ఉద్యమాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థిక స్వావలంబనకు పునాది వేసిన దూరదృష్టి గల నాయకుడు నారా చంద్రబాబునాయుడు ఆలోచనలే ఈరోజు మహిళా సంఘాల విజయగాథకు కారణమని ఆయన పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, పశుపోషణ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ముందుకు సాగేందుకు ఈ రుణాలు దోహదపడతాయని తెలిపారు. రైతు బలపడితే గ్రామం బలపడుతుంది, మహిళ బలపడితే సమాజం అభివృద్ధి చెందుతుంది అనే సందేశాన్ని ఆయన స్పష్టంగా వెల్లడించారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు మాట్లాడుతూ... కెడీసీసీ బ్యాంక్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామీణాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కొత్త బ్రాంచ్‌ల ప్రారంభం వల్ల స్థానికంగా డిపాజిట్లు, పంట రుణాలు, స్వయం ఉపాధి రుణాలు మరింత సులభంగా అందుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో మహిళా సాధికారత, రైతు సంక్షేమం, పారదర్శక పరిపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# ప్రత్యేక దృష్టితో నీటి ప్రాజెక్టుల అభివృద్ధి : వెనిగండ్ల రాము

◆ వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చెరువులు నింపుతామని వెల్లడి



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలోని నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అధికారులు, నీటి సంఘాల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని,తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తానని చెప్పారు. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో.... నియోజకవర్గ పరిధిలోని నీటి సంఘాల కమిటీలు,డీసీ చైర్మన్లు, ఇరిగేషన్, డ్రైనేజీ, విద్యుత్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం ఉదయం సమావేశం అయ్యారు. సాగునీటి ప్రాజెక్టుల సమస్యల వివరాలను.... సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల కమిటీ సభ్యులు, డిసి చైర్మన్లను మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే రాము అధికారులతో మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే రాము, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా కాలువల నిర్వహణ, తూడు తొలగింపు పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా, బాధ్యతతో పనిచేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల పెద్దలకు ఎమ్మెల్యే రాము చెప్పారు. గత ఏడాది చక్కటి ఫలితాలు వచ్చాయని, ఏడాది నీటి సంఘాల అలసత్వంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సాగునీరు అందక కోట్లలో నష్టపోతున్నామని, సమావేశంలో పాల్గొన్న ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... నియోజకవర్గంలో ప్రధానమైన వడ్లమన్నాడు డ్రైన్, చంద్రయ్య కాలువ, దోనపాడు చానల్, నెప్రోలి ఇలా ప్రధానమైన ప్రాజెక్టులతో పాటుగా,పంట కాలువల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి సంఘాలు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చెరువులు నింపాలన్నారు. నియోజకవర్గంలో ప్రధానమైన ఆక్వా రైతులకు సరిపడా నీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు.

# చిరువ్యాపారులకు మంత్రి నారా లోకేష్ చేయూత

◆మంత్రి నారా లోకేష్ సహకారంతో బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు,ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేత



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గంలో చిరువ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణం, రూరల్ మండలంలోని పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు, ప్లాట్ ఫామ్ రిక్షాలను స్థానిక నాయకులు మంగళవారం అందజేశారు. మంగళగిరి పట్టణంలోని టిడ్కోకు చెందిన కొడాలి రమాదేవి, 29వ వార్డుకు చెందిన దామర్ల పద్మ, 3వ వార్డుకు చెందిన ఇండ్ల చిన్ని, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన యలగందుల సీతారావమ్మ, నిడమర్రు గ్రామానికి చెందిన మండేపూడి వీరయ్య జయానందంకు టిఫిన్ బళ్ళు అందజేశారు. టిడ్కోకు చెందిన కొండయ్యపాలేపు నారాయణరావుకు ఇస్త్రీ బండి, 20వ వార్డుకు చెందిన పల్లపు నాగమ్మకు తోపుడు బండి అందజేశారు. అలాగే నూతక్కి గ్రామానికి చెందిన పల్లాల వాణికి బడ్డీకొట్టు, తాడేపల్లి 7వ వార్డుకు చెందిన జంజు త్రిపురకు ట్రై సైకిల్ అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టు, ఇస్త్రీ బండి, ప్లాట్ ఫామ్ రిక్షా, టిఫిన్, ట్రై సైకిల్, తోపుడు, టిఫిన్ బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎందరో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. వివిధ రకాల ఉపాధి ఆయా కుటుంబాల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు తెలిపారు.

# ఆకాశంలో ఖగోళ అద్భుత దృశ్యం

- కనువిందు చేసిన బ్లడ్‌మూన్... 2026 సంవత్సరం ప్రారంభంలోనే చోటుచేసుకున్న అద్భుతం
- ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలతో పాటు ఇండియాలోనూ సంపూర్ణ చంద్రగ్రహణం
- గ్రహణం అనంతరం తెరుచుకున్న తిరుమల శ్రీవారి ఆలయం...



2026 సంవత్సరం ప్రారంభంలోనే అద్భుతం చోటుచేసుకుంది. మొదటి ఖగోళ అద్భుతం ఆవిష్కృతం అయింది. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలతో పాటు ఇండియాలోనూ ఈ పాక్షిక చంద్రగ్రహణం కనిపించింది. ఈ అరుదైన దృశ్యాన్ని ఖగోళ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఈ క్రమంలో చంద్రుడు ఎరుపు రంగులో కనువిందు చేశాడు. దీంతో చంద్రగ్రహణం ముగిసింది. ఈ దృశ్యం ఏర్పడడానికి ముందు సాయంత్రం 3 గంటల 20 నిమిషాలకు చంద్ర గ్రహణం ప్రారంభమైంది. ఇది సాయంత్రం 06 గంటల 47 నిమిషాలకు ముగిసింది. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించిన ప్రజలు ఎంతో అనుభూతిని పొందారు. అలాగే చంద్రగ్రహణం సందర్భంగా మూసేసిన ఆలయాలను శుద్ధి చేసి భక్తులకు దర్శనాలను కల్పిస్తున్నారు. అలాగే చంద్రగ్రహణం విడిచిన తర్వాత అంతా స్నానాలు ఆచరించి, దైవ నామస్మరణలు చేశారు. హైదరాబాద్‌లో గ్రహణం విడిచే చివరి నిమిషంలో ఆకాశంలో అద్భుతం జరిగింది.

### అసలు చంద్రగ్రహణం ఎలా ఏర్పడుతుంది?

సైన్స్ ప్రకారం సూర్యుడు, చంద్రుడు ఒకే కక్ష్యలో ఉన్నప్పుడు మధ్యలోకి భూమి వచ్చి చేరినప్పుడు అప్పుడు ఆ భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. అప్పుడు దీన్ని చంద్రగ్రహణం అంటారు. అదే భూమి నీడ చంద్రుడిని పూర్తిగా కప్పేస్తే దానిని సంపూర్ణ చంద్రగ్రహణం అంటారు. సగ భాగమే కప్పి వేస్తే దాన్ని పాక్షిక చంద్రగ్రహణం అంటారు. ఇప్పుడు ఇండియాలో పాక్షిక చంద్రగ్రహణమే ఏర్పడింది. ఈ గ్రహణం దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో కనిపించింది. చాలా ప్రాంతాల్లో గ్రహణం చివరి దశలో ఉండగా బ్లడ్ మూన్ కనిపించింది. గ్రహణం ఏర్పడిన నేపథ్యంలో భారతదేశంలో ఆధ్యాత్మికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలయాల మూసివేత, గ్రహణ నియమాలు వంటి వాటిని ప్రజలు నమ్మారు.

శాస్త్రీయ కోణంలోనూ, సైన్స్ పరంగా చెప్పాలంటే చంద్రగ్రహణం అనేది చూడటం వల్ల కంటికి ఎలాంటి ప్రమాదం పొంచి ఉండదు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని నేరుగా చూడవచ్చని శాస్త్రవేత్తలు చెప్పారు. అయితే భారతీయ సంప్రదాయాల ప్రకారం చూస్తే మాత్రం గర్భిణీ స్త్రీలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఉంది. ఇప్పుడు అదే విషయాన్ని వైద్యశాస్త్రం కూడా చెబుతుంది. గ్రహణం సమయంలో జాగ్రత్తగా ఉంటే పుట్టబోయే బిడ్డకు ఎలాంటి ప్రమాదం ఉండదు. దేశమంతా ఈ గ్రహణం వీడింది. దీంతో ప్రజలు ఇంటిని శుద్ధి చేసుకొని, స్నానాలు ఆచరించారు.

### తెరుచుకున్న తిరుమల శ్రీవారి ఆలయం

చంద్రగ్రహణంతో మూసివేయబడ్డ శ్రీవారి ఆలయ తలుపులను శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు తెరిచారు. శ్రీవారి ఆలయంలో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి భక్తులకు దర్శనం ప్రారంభమైంది. మధ్యాహ్నం 3.26 నుంచి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్ర గ్రహణం ఉన్న కారణంగా ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉదయం 9 గంటలకు ఆలయ తలుపులు మూశారు. దాదాపు 10.30 గంటల అనంతరం మంగళవారం రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. చంద్ర గ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేసిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సును 7.30 గంటలకు తెరిచారు. వంటశాల శుద్ధి అనంతరం రాత్రి 8.30 గంటల నుండి భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. అదే విధంగా లడ్డు కౌంటర్లు కూడా పునః ప్రారంభమయ్యాయి.

# ఏపీలో టెన్త్‌క్లాస్ హాల్ టెన్త్ క్లాస్ హాల్ టికెట్లు విడుదల

- మార్చి 16 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల 2026 హాల్ టికెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం మంగళవారం (మార్చి 3) హాల్ టికెట్లను విడుదల చేసింది.పదో తరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని పేర్కొంది. ఆయా స్కూల్స్ లాగిన్‌తో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని సూచించింది. అలాగే ప్రధానోపాధ్యాయులు స్కూల్ లాగిన్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని తెలిపింది. అనంతరం వాటిపై సంతకం, స్కూల్ స్టాంప్ వేసి విద్యార్థులకు అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు విద్యార్థులు స్కూల్స్‌కి వెళ్లి హాల్ టికెట్లను పొందవచ్చు.10వ తరగతి హాల్ టికెట్ ఔష్ట్ఫ్యఝజూజూలో కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చు. వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర సర్వీస్ 9552300009 అనే నెంబర్ నుంచి పొందవచ్చు. అయితే వీటిపై సంతకం, స్కూల్ స్టాంప్ వేయించుకోవాల్సి ఉంటుంది.

### పదో తరగతి హాల్‌టికెట్లు విడుదల

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ పదో తరగతి హాల్‌టికెట్లను విడుదల చేసింది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత పాఠశాలలు అధికారిక వెబ్‌సైట్ ఎంవ.ఖజూ.స్త్రశీజ.అఅ నుండి ఏపీ ఎస్ఎస్సీ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీ 10వ తరగతి హాల్ టికెట్ 2026ని డౌన్‌లోడ్ చేసుకోవడానికి వారు తమ ప్రత్యేక పాఠశాల కోడ్, పాస్వర్డ్, విద్యార్థి పేరు మరియు పుట్టిన తేదీని ఉపయోగించాలి. విద్యార్థులు వారి హాల్ టికెట్‌ను స్వయంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని తెలిపింది.మరోవైపు ప్రైవేటు విద్యార్థులు మాత్రం అధికారిక వెబ్‌సైట్ నుంచి ఏపీ ఎస్ఎస్సీ హాల్ టికెట్ 2026ని ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకోవచ్చు అని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 16 నుండి 30 మార్చి 2026 వరకు పరీక్షలు జరగనున్నాయి. బోర్డు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా వారి ఏపీ ఎస్ఎస్సీ హాల్ టికెట్ మరియు పాఠశాల గుర్తింపు కార్డును ప్రతిరోజూ తీసుకెళ్లాలసి ఉంటుంది. లేకపోతే వారిని పరీక్షకు అనుమతించరు.

### తప్పులను సరిచేసుకోవాల్సి ఉంటుంది

ఇకపోతే హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వీటిల్లో విద్యార్థులు తమ పేరు, రోల్ నంబర్, ఫొటో, పరీక్షా కేంద్రం, పరీక్షల షెడ్యూల్ వంటి వివరాలను సరిచూసుకోవల్సి ఉంటుంది. ఏవైనా తప్పులుంటే వెంటనే పాఠశాల అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.ఉదాహరణకు హాల్ టికెట్‌లో విద్యార్థి ఫోటో తప్పుగా ముద్రించబడిన సందర్భంలో ప్రధానోపాధ్యాయులు దానిపై సరైన ఫోటోను అతికించాలి. ఇంకా వారు దానిని ధృవీకరించి, ప్రింట్ తీసి పాఠశాలలోని సంబంధిత విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

# పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మంచినీటి ట్యాంకు పంపిణీ

- ప్రభుత్వ హై స్కూల్ పూర్వ విద్యార్థులు1986-1990 బ్యాచ్ చేయూత
- వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంచినీటి సౌకర్యర్థం
- ప్రయాణికుల దాహార్తిని తీర్చే విధంగా పూర్వ విద్యార్థుల మానవత్వం
- శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త, పూర్వ విద్యార్థుల అధ్యక్షులు వై. యుగంధర్ రెడ్డి



ఆత్మకూరు (చైతన్యరథం): పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహన్ని తీర్చేందుకు ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత జిల్లా పరిషత్ పాఠశాలలో చదువు అభ్యసించిన పూర్వ విద్యార్థులు 1986- 1990 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మానవత్వం చాటుకొని అందరి సహకారంతో మంగళవారం పట్టణంలోని ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్లో మంచినీటి స్టీల్ ట్యాంకును ఏర్పాటుచేసి ప్రయాణికులకు త్రాగునీటి సౌకర్యం కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి పార్టీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త పూర్వ విద్యార్థుల అధ్యక్షులు వై.యుగంధర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వై. యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రమశిక్షణ సేవ భావం కలిగి ఉండాలని అన్నారు సుదూర ప్రాంతాల నుంచి ఎంతోమంది ప్రయాణికులు వచ్చిపోయే ప్రయాణికులను బస్టాండ్ ఆవరణంలో డబ్బులు పెట్టి కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు మంచినీటి సౌకర్యం కల్పించడం వల్ల ప్రయాణికులకు ఉచితంగా నీరు లభించనుంది అని అన్నారు. రాత్రివేళ సమయంలో ప్రయాణికులు మంచినీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలని విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పూర్వ విద్యార్థుల చేయితతో ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందిస్తూ నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలపై అలుపెరగని నాయకుడిగా ఉంటూ పూర్వా విద్యార్థుల కలయికతో మానవత్వం చాటుకొని సేవా కార్యక్రమాలలో వై. యుగంధర్ రెడ్డి ఎంతో చురుగ్గా పాల్గొంటున్నారు ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికులకు స్టీల్ మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయడంపై పూర్వ విద్యార్థులకు వివిధ గ్రామాల ప్రయాణికులు మీడియా ముఖంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ కోటయ్య నాయక్ గ్యారేజ్ సెక్షన్ అధికారి సుబ్రహ్మణ్యం ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో హోలీ వేడుకల్లో అప్రమత్తతతో చిన్నారుల చూపు కాపాడిన 108 సిబ్బంది

- తక్షణ వైద్య సహాయంతో నాలుగు చిన్నారులు క్షేమం




విజయనగరం (చైతన్యరథం): పట్టణంలో హోలీ వేడుకల సందర్భంగా జరిగిన ఒక ఘటనలో నాలుగు మంది చిన్నారుల కళ్లలో రంగులు పడటంతో వారు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తక్షణ ప్రాథమిక చికిత్స అందించారు. సమయానికి స్పందించి కళ్లను శు భ్రపరచడం, అవసరమైన ప్రాథమిక వైద్య సహాయం అందించడం వల్ల తీవ్రమైన ప్రమాదం తప్పింది. అనంతరం చిన్నారులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మరింత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల ప్రకారం, తక్షణ చికిత్స అందడంతో చూపుకు ఎటువంటి శాశ్వత నష్టం కలగకుండా కాపాడగలిగారు.ఈ సందర్భంగా 108 అత్యవసర వైద్య సేవల సిబ్బంది అప్రమత్తత, వేగవంతమైన స్పందన ప్రశంసనీయమని స్థానిక ప్రజలు అభినందించారు. హోలీ వంటి పండుగల సందర్భంగా రసాయన పదార్థాలు కలిగిన రంగులు ఉపయోగించకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు, అధికారులు సూచించారు.

# హెూలీ రంగులతో కళకళలాడిన విశాఖ బీచ్

కులమత భేదాలు లేకుండా అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ హోలీ. చలికాలానికి వీడ్కోలు పలుకుతూ వసంత ఋతువుకు స్వాగతం పలికే ఈ రంగుల వేడుక నగరాల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపుతుంది. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ హోలీ సందడి చేసుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. ఈసారి విశాఖలో హోలీ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విశాఖపట్నం నగరం మొత్తం రంగుల మయంగా మారింది. విశాఖపట్నం పోర్ట్ స్టేడియం, బీచ్ రోడ్ విశాఖపట్నం, ఆక్సిజన్ టవర్స్ ప్రాంతాల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. అపార్ట్మెంట్లు, కాలనీలు, ఓపెన్ గ్రౌండ్లు అన్నీ రంగులతో కళకళలాడాయి.

# నిర్మాణ పనుల్లో పారదర్శకత అవసరం

**● అధికారులకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచన**



మడకశిర (చైతన్యరథం): పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మడకశిర నియోజకవర్గం వీబీజీ రామ్ గ్యారెంటీ స్కీమ్ అధికారులు, ఏపీడీ, 5 మండలాల ఏపీఓ మరియు సీఏ, టీఏ అధికారులు మరియు పంచాయతీరాజ్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి. ఉపాధి హామీ పథకం ద్వారా మడకశిర నియోజకవర్గంలో మంజూరైన సీసీ రోడ్లు, మరియు బీటీ రోడ్ల, వేయడం, ఇంకా అవసరమున్న గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు గుండుమల తిప్పేస్వామి సూచించారు. నిర్దేశించిన గడువు లోపల అధికారులు నాయకులతో సమన్వయం చేసుకొని సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర కుంచిటిగ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పట్టణ మండల కన్వీనర్లు సింగల్ విండో అధ్యక్షులు మార్కెట్ యార్డ్ చైర్మన్ కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, అనుబంధ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

**టీడీపీలో చేరిన వైసీపీ పంచాయతీ కన్వీనర్**

మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలం కొంకల్లు గ్రామానికి చెందిన వైయస్సార్సీపీ పంచాయతీ కన్వీనర్ మహాలింగప్ప వైసీపీ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ లోకి చేరారు. అనంతరం పట్టణంలోని బాలాజీ నగర్ టీడీపీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా వైసీపీ వీడి టీడీపీలో చేరిన మహాలింగప్పకు మాజీ ఎమ్మెల్సీ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు.

# కెఎస్ఎస్ సర్వేలో అర్హులందరికీ చేరుతున్న సంక్షేమం



రామకుప్పం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అమలు చేసిన కేఎస్ఎస్ సర్వేల ద్వారా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు సమకూరుతున్నాయని మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. రామ్ కుప్పం పంచాయతీ 69 బూత్ నెంబర్లు ఇంటింటా తిరిగి కెఎస్ఎస్ సర్వేను నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో కెఎస్ఎస్ సర్వే ద్వారా ఆ కుటుంబానికి లబ్ధి చేకూతున్నట్లు చెప్పారు. మండలంలో ఈ కార్యక్రమాన్ని ఇంటింటా తిరిగి వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. సకాలంలో కెఎస్ఎస్ సర్వేను పూర్తి చేసి పార్టీ అధిష్టానం మేరకు కుప్పం పార్టీ కార్యాలయంలో సమకూర్చుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, కుప్పం ఏరియా కమిటీ డైరెక్టర్ ఆర్ విజయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అల్లి శీన, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బూత్ కమిటీ కన్వీనర్ చలపతి, టిడిపి ముఖ్య నేత మనీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెఎస్ఎస్ సర్వేలో అర్హులందరికీ చేరుతున్న సంక్షేమం

ఎల్నినో ప్రభావంతో వాతావరణంలో కీలక మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో జనం అల్లాడిపోతున్నారు. గత మూడు సంవత్సరాలలో అత్యంత వేడి నెలగా ఈ ఏడాది ఫిబ్రవరి నెల రికార్టు సృష్టించింది. అంతేకాకుండా, మార్చి కూడా మండే ఎండలు, తీవ్రమైన వేడితో ప్రారంభమైంది. గతంలో, మార్చి 1 నుండి మార్చి రెండవ లేదా మూడవ వారం వరకు జనం స్వెటర్లు, జాకెట్లు ధరించేవారు. కానీ ఈ సంవత్సరం, ఫిబ్రవరి రెండవ వారం నుండే ప్రజలు తమ స్వెటర్లు, జాకెట్లను దూరం పెట్టారు. ప్రస్తుతం, మార్చి 1 నుండి మండే ఎండలు ప్రారంభమయ్యాయి. వాతావరణంలో మార్పుల కారణంగా తీవ్రమైన వేడిని ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మార్చి 1 నుంచి వాతావరణం చాలా వేడిగా మారిపోయింది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ కీలక సూచనను జారీ చేసింది. గరిష్ట ఉష్ణోగ్రత 31 నుండి 32 డిగ్రీల సెల్సియస్ ఉండనున్నాయి. రాత్రి ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. కానీ మార్చి 4 నుండి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమవుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. మార్చిలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా, ఈ సంవత్సరం వేడిగాలులు ఏ రికార్డులను బద్దలు కొడతాయో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటు ఎల్నినో ప్రభావం తెలుగు రాష్ట్రాలపై బాగానే ఉంది. ముఖ్యంగా కర్నూలు జిల్లాను కుదిపేస్తోంది. వేడి వడగాలులతో టెన్షన్ పెడుతోంది. జాతీయస్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు కర్నూలులోనే నమోదవుతున్నాయి. గత వేసవిలో దేశంలోనే అత్యధికంగా కర్నూలులో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. 2024లో ఇప్పటివరకు దేశంలోనే ఎక్కడా ఎప్పుడు లేనివిధంగా 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైన సంగతి తెలిసిందే. దీని ప్రభావంతో గాలిలో తేమ 15 శాతానికి పడిపోవటం మరింత ఆందోళనకు గురిచేస్తుంది.

# జాతీయ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

**●ప్రజా సంక్షేమానికి బాటలు వేయండి... దేశాభివృద్ధిలో భాగస్వామ్యులవ్వండి**

**●పాత్రికేయులకు సూచించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



చిత్తూరు (చైతన్యరథం): ప్రజా సంక్షేమం కోరి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ పథకాలను ప్రజలకు చేరువచేసి, వారి అభ్యున్నతికి పాటుపడాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పాత్రికేయలకు సూచించారు. మరీ ముఖ్యంగా జాతీయ పథకాల పై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత మీడియా రంగంపై ఉందని ఆయన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం పీఐబీ సంస్థ విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో, మంగళవారం చిత్తూరులోని ప్రజా గ్రౌండ్ ప్రైవేట్ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన "వార్తలాప్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో" అవగాహన సదస్సుకు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వర్క్ షాప్‌కు పి.ఐబి డైరెక్టర్ సురేష్ కుమార్, ఎల్ డి ఎం.హరీష్ కుమార్, జిల్లా డీడబ్ల్యూ ఏంఏ పిడి రవికుమార్, రాష్ట్ర వీబీ–జీ రాం జీ యాక్ట్ గోపీచంద్ తదితరులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారదర్శకతతో కూడిన సమాచారాన్ని చేరవేసినప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువ చేసేందుకు వీలవుతుందని తెలిపారు. జాతీయ స్థాయి పథకాలపై గ్రామీణ ప్రాంతాలలో అవగాహన పెంచేందుకు పాత్రికేయులు చొరవ చూపాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతతో ముందుకు తీసుకపోవడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం 60%, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం అమలుతో గ్రామీణుల ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగు పడడం సంతోషదాయకమన్నారు. వైద్యా, విద్యారంగాలతో పాటు, గృహ నిర్మాణ రంగాలకు సంబంధించి,.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ పథకాలను యువత, రైతులు, మహిళలకు అందించేందుకు ఎన్డీఏ సర్కార్ చేపట్టిన విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయని ఆయన కొనియాడారు. VB-G RAM-G అనేది గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు, మౌలిక వసతులను బలోపేతం చేయేందుకు రూపొందించిన సమగ్ర చట్టమని చెప్పిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు... ఇది పూర్వపు ఉపాధి హామీ విధానాలను మరింత విస్తరించి, గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉపాధి రోజులు కూడా పెరిగాయని ఎంపీ పేర్కొన్నారు.

# పంపనూరు లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

**● వేలాది మంది భక్త జనం నడుమ సాగిన రథోత్సవం**

**● కుటుంబ సభ్యులుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన సునీత**

**● స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్ష**



ఆత్మకూరు (చైతన్యరథం): ఆత్మకూరు మండలం పంపనూరు కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ రథోత్సవ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. చంద్ర గ్రహణం నేపథ్యంలో అనుకున్న సమయం కంటే ముందే రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 8గంటలకే ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి.. మడుగు తేరు ప్రారంభించారు. ఆ తర్వాత రథోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ఆమె కుటుంబ సభ్యులు స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు తరలిరావడంతో పంపనూరు కొండ జనసంద్రంగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని నిర్వాహకులకు, పోలీసులకు ఎమ్మెల్యే సునీత సూచించారు. రాప్తాడు నియోజకవర్గ ప్రజలందరిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. త్వరలో పంపనూరు క్షేత్రంలో జరగబోయే అభివృద్ధి పనులతో ఈ ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఆమె అన్నారు.

# రైల్లో సీటు కోసం లొల్లి... తుపాకీ తీసి ప్రయాణీకులను బెదిరించిన రిటైర్డ్ పోలీస్ ఉద్యోగి



అనంతపురం (చైతన్యరథం): రైల్లో జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న ఓ ఇద్దరి ప్రయాణికుల మధ్య సీటు కోసం గొడవ జరిగింది. మాట మాట పెరిగింది. అంతలోనే ఓ ప్రయాణికుడు తుపాకీ తీసి తోటి ప్రయాణికుడిని బెదిరించడంతో.. ఒక్కసారిగా ప్రయాణికులు అందరూ భయభ్రాంతులకు గురి అయ్యారు. ఈ గొడవ అంతా దూరం నుంచి చూస్తున్న ఓ ప్రయాణికుడు తుపాకీతో బెదిరిస్తున్న ప్రయాణికుడిని ఫోటోలు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అసలేం జరిగిందంటే.. యలహంక నుంచి కాచిగూడ వెళ్తున్న ఎక్స్ప్రెస్ రైలు జనరల్ కోచ్‌లో ఇద్దరు ప్రయాణికులు సీటు విషయంలో గొడవపడ్డారు. ఇద్దరి మధ్య గొడవ పెద్దదవడంతో ఓ ప్రయాణికుడు తన దగ్గర ఉన్న తుపాకీ తీసి బెదిరించడంతో జనరల్ కోచ్ లోని ప్రయాణికులు ఒక్కసారిగా షాక్కు గురయ్యారు. ఈ గొడవ జరుగుతున్న తంతును దూరం నుంచి మరో ప్రయాణికుడు ఫోటోలు తీసి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు వాట్సప్ లో ఫిర్యాదు చేశాడు. సరిగ్గా రైలు అనంతపురం జిల్లా గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోకి వచ్చాక ట్రైన్ ఆపి తుపాకీతో బెదిరించిన వ్యక్తిని పోలీసులు విచారించారు. తుపాకీతో బెదిరించిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రం చెందిన మనోహర్ అనే రిటైర్డ్ సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్‌గా పోలీసులు గుర్తించారు. రిటైర్డ్ పోలీసు ఉద్యోగి వద్ద లైసెన్స్డ్ పిస్టల్ ఉందని పోలీసులు గుర్తించారు. అయితే అతడు తోటి ప్రయాణికులతో సీటు కోసం గొడవపడి భయభ్రాంతులకు గురి చేసే విధంగా తుపాకీ తీసి బెదిరించడాన్ని రైల్వే పోలీసులు సీరియస్ గా పరిగణించింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో లైసెన్స్ వెపన్ బయటకు తీసి తుపాకీతో బెదిరించిన ఘటనను పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. ఫోటోలు తీసి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తి ఎవరు అనేదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. రైలు ప్రయాణం ప్రశాంతంగా జరుగుతుంది అనుకున్న సమయంలో తుపాకీతో బెదిరించడంతో ట్రైన్లోని ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు.

# మేమున్నాం...

# ధైర్యంగా ఉండండి

## గల్ఫ్ ప్రవాసాంధ్రులకు మంత్రి సుభాష్ భరోసా



రామచంద్రపురం (చైతన్యరథం): ఇజ్రాయిల్–ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారికి మేమున్నామంటూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండండని, రాష్ట్రానికి క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. గల్ఫ్ దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా మంత్రి సుభాష్ మంగళవారం ప్రవాస ఆంధ్రులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. కొన్ని విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్ఆర్ఐ సాధికారత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లతో పాటు తాను కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ధైర్యం చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రవాస ఆంధ్రుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు ఏపీఎన్ఆర్‌టీఎస్ ఈ–మెయిల్: helpline@apnrts.comకు, 24/7 హెల్ప్‌లైన్, +918500027678 వాట్సాప్ ద్వారా సమాచారం



అందించవచ్చన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఆంధ్రులు ఎవరూ ఆందోళన చెందకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.


ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన ప్రతి కార్మికుడి భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరుదేశాల మధ్య త్వరలోనే శాంతి నెలకొని సాధారణ పరిస్థితులు ఏర్పడాలని ఆకాంక్షించారు.

మస్కట్ నుంచి బొంతు నాగరాజు, కట్టా నాగమల్లేశ్వరరావు, కువైట్ నుంచి కట్టా భాస్కర్, దుబాయ్ నుంచి కదలి వెంకటకృష్ణ, ఖతార్ నుంచి పితాని సత్యనారాయణ (సత్యమూర్తి), బహ్రెయిన్ నుంచి చింతపల్లి లక్ష్మీనారాయణ, సౌదీ అరేబియా నుంచి పితాని రాంబాబు తదితరులు మంత్రి సుభాష్‌తో వీడియో కాల్ ద్వారా అక్కడి పరిస్థితు లను వివరించారు. కార్మికుల పట్ల మంత్రి సుభాష్‌కున్న చిత్తశుద్ధిని ప్రస్తుతించి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షోభ సమయంలో తమకు అండగా నిలిచి ధైర్యం చెప్పినందుకు మంత్రి సుభాష్‌కు గల్ఫ్ దేశాల కార్మికుల ప్రతినిధి బొంతు నాగరాజు అభినందనలు తెలిపారు.

## 149 మందితో దుబాయ్ నుంచి వచ్చిన రెస్క్యూ విమానం



పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఎయిర్ ఇండియా దుబాయ్ నుంచి తొలి రెస్క్యూ విమానాన్ని నడిపింది. ఈ విమానంలో 149 మంది ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఈ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ తరలింపు చర్య పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.



## సురక్షితంగా చేరుకున్న పీవీ సింధు

*న్యూఢిల్లీ: ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కొన్ని రోజులు దుబాయ్‌లో ఉండిపోయిన పీవీ సింధు తాజాగా స్వదేశానికి చేరుకున్నారు. తాను స్వదేశానికి సురక్షితంగా వచ్చానని సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు.*

*ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం క్రీడాకారుల ప్రయాణాలపైనా పడిన నేపథ్యంలో సింధు సురక్షితంగా తిరిగి రావడం అభిమానుల్లో ఆనందం నింపింది.*

## గల్ఫ్ దేశాల నుంచి ఇండియాకు పాక్షికంగా విమాన సర్వీసులు

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అక్కడున్న భారతీయులు మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలిచిపోయిన విమాన సర్వీసులు గల్ఫ్ దేశాల నుంచి ఇండియాకు పాక్షికంగా ప్రారంభమయ్యాయి. సౌదీ అరేబియా, జెడ్డా నుంచి ప్రత్యేక విమాన సర్వీసులను నడుపుతున్నట్టు ఇండిగో సంస్థ వెల్లడించింది. గతంలో టికెట్లు బుక్ చేసుకుని ప్రస్తుత పరిస్థితి కారణంగా ప్రయాణించలేని కష్టమర్ల కోసం ఈ విమానాలను ఏర్పాటు చేస్తున్నారు.




## దుబాయ్‌లో చిక్కుకున్న రెండు వేల మంది హైదరాబాదీయులు

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం హైదరాబాద్ వాసులను వణికిస్తోంది. దుబాయ్ విమానాశ్రయం మూసివేతతో పర్యాటకం, వ్యాపారాలు, ఉన్నత విద్య, వైద్యం కోసం వెళ్లిన వారిలో సుమారు 24వేల మందికి పైగా భారతీయులు అక్కడ చిక్కుకున్నారు. వీరిలో సుమారు రెండు వేల మంది హైదరాబాదీయులే ఉన్నారని ట్రావెల్ ఏజెన్సీలు చెప్తున్నాయి. దీంతో ఇక్కడ ఉంటున్న వారి కుటుంబీకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అయితే సోమవారం రాత్రి దుబాయ్ ఎయిర్‌పోర్టును పునరుద్ధరించారు. భారత్‌కు వెళ్లే చైన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై విమానాలు టేకాఫ్ అయ్యాయి. హైదరాబాద్ ప్రయాణికుల కోసం ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ బోర్డింగ్ పాసులు ఇచ్చినా ఫ్లైట్‌ను రద్దు చేసింది.




**అట్లాంటా తెలుగు సంఘం ఆధ్వర్యంలో**

## 22న బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఆల్ఫారెట్టా: అట్లాంటా తెలుగు సంఘం (టామా) 45 వసంతాల వేడుకల్లో భాగంగా క్రీడాభిమానుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తోంది. ఈ పోటీలు మార్చి 22వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం రాత్రి గంటల వరకు ఆల్ఫారెట్టాలోని ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతాయి. పెద్దలకు, పిల్లలకు వేర్వేరు విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంటులో పాల్గొనడానికి మొదటి ఈవెంట్‌కు 25 డాలర్లు, రెండో ఈవెంట్‌కు 20 డాలర్లు, అదనపు ఈవెంట్లకు ఒక్కోదానికి 15 డాలర్ల చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు నిర్ణయించారు. ఆసక్తి గల క్రీడాకారులు https://www.tama.org/atlbadminton లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ క్రీడా సంబరంలో పాల్గొని ప్రతిభ చాటుకోవాలని టామా అధ్యక్షురాలు సునీత పొట్నూరు, క్రీడా కార్యదర్శి హరికృష్ణ అద్దంకి, చైర్మన్ మధుకర్ యార్లగడ్డ కోరారు.




**టీఏజీసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న**

## ఉగాది, శ్రీరామనవమి వేడుకలు

చికాగో: తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చికాగో ఆధ్వర్యంలో ఏప్రిల్ 4వ తేదీన ఉగాది, శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నారు. అరోరాలోని మీటియా వ్యాలీ హైస్కూల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది, శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చికాగో (టీఏజీసీ) భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 4వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి అరోరా నగరంలోని మీటియా వ్యాలీ హైస్కూల్లో వేడుకలు జరుగుతాయి. సంప్రదాయబద్ధంగా పంచాంగ శ్రవణం, ఉగాది కవి సమ్మేళనం, పిల్లల కోసం ప్రత్యేకంగా రామాయణ చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నారు. వీటికి తోడు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు, షాపింగ్ కోసం వెండర్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయి.

ఈ వేడుకల్లో పాల్గొనే టీఏజీసీ సభ్యులకు, 18 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం ఉచితం. సభ్యులు కాని వారు ఆన్‌లైన్ ద్వారా 20 డాలర్లు, నేరుగా వేదిక వద్ద అయితే 25 డాలర్లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆసక్తి గల వారు సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ప్రెసిడెంట్ అర్చన పొద్దుటూరి, సాంస్కృతిక విభాగం ప్రతినిధులు కోరారు. కార్యక్రమ వివరాల కోసం 630-849-9135 నెంబరును సంప్రదించవచ్చు.



# వండి... వడ్డించు

## డర్హామ్, వేక్ ప్రాంతాల్లో ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ సేవా నిరతి

రాలీ, ఉత్తర కరోలినా: ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ (NRIVA) రాలీ చాప్టర్ సేవా బృందం, డర్హామ్‌లోని ఆర్‌హెచ్‌ఎంసీ వేదికగా “వండి వడ్డించు” (Cook and Serve the Needy) అనే గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించి సేవా నిరతి చాటుకుంది. సమాజానికి తిరిగి ఇవ్వాలనే దృఢ సంకల్పానికి ఇది నిదర్శనంగా నిలిచింది.



**నాయకత్వం, బృందం:** కుక్ టీమ్ లీడ్ శ్రీధర్ కట్కం నేతృత్వంలో స్వచ్ఛంద సేవకులు అంకితభావంతో పోషక విలువలున్న ఆహారాన్ని సిద్ధం చేశారు.

**వాలంటీర్ల కృషి:** శ్రీలత కట్కం, ఆద్య కట్కం, రామారావు కొత్తమాసు, భూమేష్, శివ బోనగిరి, అనిల్ కుమార్ కొత్త, బదరి కొమ్మురు, సతీష్ మొదలు వాలంటీర్లు తమ సమయాన్ని వెచ్చించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**సేవ:** కేవలం రెండు గంటల వ్యవధిలో 60 మందికి సరిపడా వేడి వేడి భోజనాన్ని ప్యాక్ చేసి రాత్రి భోజన సమయానికి అందించారు.

**సేవా దృక్పథం:**

RMHC డర్హామ్‌లో అనారోగ్యంతో ఉన్న తమ పిల్లల కోసం పోరాడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం పట్ల సేవా బృందం వినమ్రత వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమం కేవలం ఆకలిని తీర్చడమే కాకుండా వాలంటీర్ల మధ్య ఐక్యతను, తోటివారిపై సానుభూతిని పెంపొందించింది.

**భవిష్యత్తు ప్రణాళికలు:**

**నాయకత్వ సహకారం:** రాలీ చాప్టర్ లీడ్స్ నందు కొండూరి, లీలా ప్రసాద్ మడాలి, సందీప్



పెట్టుకుంది.

**విరాళాలు & స్పాన్సర్‌షిప్:** పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు లేదా ఇతర ప్రత్యేక సందర్భాలలో ఇలాంటి వంట, సేవా కార్యక్రమాలను స్పాన్సర్ చేయాలనుకునే దాతలను NRIVA ఆహ్వానిస్తోంది.



## డెంటన్ షెల్టర్‌లో టాంటెక్స్ బృందం ఆధ్వర్యంలో అన్నదానం

డెంటన్: ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (టాంటెక్స్) సేవా దృక్పథంతో డెంటన్‌లోని నిరుపేదల కోసం అన్నదానం నిర్వహించింది. ఇందులో భాగంగా టాంటెక్స్ బృందం సభ్యులు స్వయంగా వంట చేసి డెంటన్ షెల్టర్‌లో ఆకలితో ఉన్న వారికి ప్రేమతో ఆహారాన్ని వడ్డించారు. తోటి వారికి సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం తమకు ఎంతో సంతృప్తి, వినమ్రత కలిగించిందని సభ్యులు పేర్కొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడానికి ఇస్కాన్ దేవాలయం వారు వంటశాల సౌకర్యాలను కల్పించి, అడుగడుగునా గొప్ప సహకారం అందించారు. తమ విలువైన సమయాన్ని వెచ్చించి, అంకితభావంతో వంట చేయడంలోను, వడ్డించడంలోను పాలుపంచుకున్న ప్రతి ఒక్క టీమ్ సభ్యుడికి కార్యవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్ల ఈ కార్యక్రమం మరింత అర్థవంతంగా, ఉత్సాహంగా సాగింది. సమాజానికి తిరిగి ఏదైనా చేయాలనే లక్ష్యంతో ఈ సేవా అవకాశాన్ని కల్పించినందుకు సభ్యులందరూ కృతజ్ఞతలు తెలిపారు.



# ఇరాన్-ఇజ్రాయెల్ వార్ ప్రభావం..

**ఇంధన ధరలు పెరుగుతాయా?**




ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా యుద్ధం కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే ఆదేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అంతమొందించిన భద్రతా బలగాలు.. ఇంకా దాడుల పరంపరను కంటిన్యూ చేస్తున్నాయి. మరోవైపు ఇరాన్ సైతం తగ్గడం లేదు. ప్రతీకార దాడులతో చెలరేగిపోతోంది. ఇజ్రాయెల్, అమెరికాపై దాడి చేస్తూనే.. ఇరాన్ చుట్టూ ఉన్న వాటి మిత్రదేశా ల్లోని అమెరికా సైనిక స్థావరాలపైనా విరుచుకుపడుతోంది. దీంతో మధ్య ప్రాచ్యంలో యుద్ధం తీవ్ర ఉద్రిక్తతలను రేపుతోంది. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు తీవ్రంగా ప్రభావితమవు తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ సహా మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్ అనేక ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోం ది. దీంతో ఈ యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్, గల్ఫ్ కంట్రీస్ నుంచి చమురు, గ్యాస్, విలువైన ఖనిజాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్‌ని భారత్ దిగుమతి చేసుకుంటుంది. అయితే, యుద్ధం నేపథ్యంలో ఇరాన్.. రవాణా కేంద్రమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటిం చింది. హోర్ముజ్ జలసంధిని మూసి వేయడంతో భారత్‌కు వచ్చే ఆయా ఉత్పత్తుల రవాణా నిలిచిపోయింది. దీంతో మన దేశంలో వీటి ధరలు విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపు ణులు అంచనా వేస్తున్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎలక్ట్రా నిక్ వస్తువులు, బంగారం, వెండి, ఎరువులు, వ్యవసాయ పరికరా ల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

### టెన్షన్ అవసరం లేదు..

మార్కెట్ వర్గాల అంచనాలు అలా ఉంటే.. ప్రభుత్వ వర్గాలు మాత్రం టెన్షన్ పడాల్సిన అవసరం లేదని చెబుతున్నాయి. ముడి చమురు, గ్యాస్ విషయంలో కంగారుపడాల్సిందేమీ లేదంటున్నా రు. ఈ విషయంలో భారత్ కంఫర్ట్ జోన్‌లోనే ఉందంటున్నారు. 'ముడి చమురు, ఎల్‌పిజి, ఎల్ఎన్‌జిల విషయానికొస్తే టెన్షన్ పడాల్సిన పనిలేదు. ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ముడి చము రు నిల్వలు ఉన్నాయి. మరో 25 రోజులకు సరిపడా ఉత్పత్తులు రవాణాలో ఉన్నాయి.' అని ప్రభుత్వ వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి.



## భారత్‌కు కెనడా యురేనియం

- పౌర ఇంధన అవసరాల కోసం క్యాంపస్‌లు
- స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం పేరు మార్పు
- ఢిల్లీలో ఇద్దరు ప్రధానులు మోదీ, కార్నేల చర్చలు

*న్యూఢిల్లీ: భారత్‌కు యురేనియం సహా ఇతర కీలక ఖనిజాలను సరఫరా చేసేందుకు కెనడా అంగీకరించింది. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.15 లక్షల కోట్ల డాలర్లు) స్థాయికి చేర్చాలని ఇరు దేశాలు నిర్ణయించా యి. ఇవన్నీ అమలుకు వీలుగా 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందా' (కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ)ని కుదుర్చుకోవాలని ప్రతిపాదించాయి. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని మార్క్ కార్నే, భారత ప్రధాని నరేంద్ర మోదీల మధ్య సోమవారం హైదరాబాద్ హౌస్‌లో జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. రక్షణ రంగం, కీలక సాంకేతిక పరిజ్ఞానం, చిన్న, మాడ్యులర్ తరహా అణు రియాక్టర్ల సరఫరా, విద్య, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పరస్పరం సహక రించుకోవాలని ఇరువురు ప్రధానులు అంగీకరించారు. పౌర అణు విద్యుత్తు కోసం కెనడా 2.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.24 వేల కోట్లు) యురేనియాన్ని సరఫరా చేయనుంది. అమెరికాతో ఆర్థిక సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో భారత్‌తో వాణిజ్యాన్ని పెంచుకోవాలని భావిస్తున్న కెనడా అందుకు అనుగుణంగా చర్చలు జరిపింది. తొలుత ముంబైలో దిగి అక్కడ రెండు రోజులు పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపిన ప్రధాని కార్నే ఆదివారం ఢిల్లీ రావడం గమనార్హం. ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్యం ఏటా 13 బిలియన్ డాలర్లు (రూ.1.20 వేల కోట్లు) వరకు ఉండగా, దాన్ని గణనీయంగా పెంచాలని నిర్ణయించారు. అందుకే రెండు దేశాల్లో పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు పెరిగేలా సమగ్ర ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్టు ఈ సందర్భంగా మోదీ ఓ ప్రకటనలో తెలిపారు. భారత్‌లో కెనడా పెట్టుబడిదార్లు 100 బిలియన్ డాల ర్లు (సుమారు రూ.9 లక్షల కోట్లు) వరకు పెన్షన్ ఫండ్‌ల్లో పెట్టారని, దేశం వృద్ధిపై వారికున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని చెప్పారు.*

*దీర్ఘకాలం పాటు యురేనియం సరఫరా చేయడం కీలక అంశమని తెలిపారు. ఇంధన రంగంలో రానున్న తరానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపైనా ఒప్పందం కుదిరిందని చెప్పారు. హైడ్రో కార్బన్లు, గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ స్టోరేజ్, సౌర, పవన విద్యుత్తు, విద్యుత్తు వాహనాలు, తదితర అంశాల్లో సహకారం ఉంటుందని వివరించారు. విద్యా రంగంలో కుదిరిన ఒప్పందాలను మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఏఐ, ఆరోగ్యం, వ్యవసాయం, ఆవిష్కరణలు తదితర అంశాల్లో ఇరు దేశాల విశ్వవిద్యాలయాల మధ్య భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. కెనడా యూనివర్సిటీలు భారత్‌లో క్యాంప్‌సలు ఏర్పాటు చేసుకోవచ్చని వెల్లడించారు. పశ్చిమాసియాలోని తాజా పరిస్థితిపైనా చర్చించారు. సంప్రదింపులు, దౌత్యపర మార్గాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన, నమ్మకమైన ఇంధన సరఫరా కోసమే యూరేనియం ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు కెనడా ప్రధాని కార్నే తెలిపారు. దీనిని 'ల్యాండ్ మార్క్' ఒప్పందంగా ఇరు దేశాలు అభివర్ణించాయి. రెండు దేశాల మధ్య కుదిరే స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాన్నే అధికా రికంగా 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం'గా పిలుచు కుంటున్నాయి. ఇందుకు సంబంధించి పరిశీలించాల్సిన అంశా లపై రెండు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, మణీందర్ సిద్ధు సంతకాలు చేశారు. ఒప్పందంలోని అంశాలను త్వరగా ఖరారు చేయాలని నిర్ణయించారు.*

### పశ్చిమాసియా ఘర్షణల్లో

# ముగ్గురు భారతీయ నావికుల మృతి

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఘర్షణలో ఇప్పటి వరకూ ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందగా, ఒకరు తీవ్రంగా గాయపడి నట్టు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ మంగళవారం తెలిపింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ సైనిక చర్యలు తీవ్రమవుతుం డటంతో ప్రధానమైన వాణిజ్య మార్గాల్లో అంతరాయం కలుగు తోందని పేర్కొంది. 'వాణిజ్య నౌకలపై నాలుగు దాడి ఘటనలు జరిగినట్టు సమాచారం ఉంది. ముగ్గురు నావికులు మృతి చెందగా, ఒక నావికుడు గాయపడ్డారు. వీరంతా విదేశీ జెండాలున్న నౌకల్లో సేవలందిస్తున్నారు' అని డీజీఎస్ తెలిపింది. కీలక వాణిజ్య మార్గాలైన గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను నిశితంగా గమనినిస్తున్నామని, ఆయా మార్గాల్లో భద్రతను కచ్చితంగా దృష్టిలో ఉంచుకోవాలని షిప్పింగ్ ఆపరేటర్లకు సూచనలిచ్చామని పేర్కొంది. అనుమానాస్పద కార్యక్ర మాలపై వెంటే రిపోర్ట్ చేయాలని కోరినట్టు తెలిపింది. వాణిజ్య నౌకలు, సిబ్బందిపై దాడులు పెరుగుతున్నందున ప్రమాదం ఎక్కువగా ఉన్న రూట్లను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 200కు పైగా నౌకలు ఆ రూట్లకు



దూరంగా ఉండటం, లంగరు వేసి ఉంచడం జరుగుతోంది. కాగా ఇప్పటివరకూ రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమెన్‌లోని భారత రాయబార కార్యాల యం చర్యలు తీసుకుంటున్నట్టు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ తెలిపారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయ నావికులకు తక్షణ సాయానికి భారత్ తరపున ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సిబ్బంది కుటుంబాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాల్సిందిగా షిప్పింగ్ కంపెనీలకు సూచించామని వివరించారు.

# గల్ఫ్ దేశాల అధినేతలకు ప్రధాని ఫోన్

మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ అరబ్ దేశాల అధినేతలతో ఫోన్‌లో చర్చలు జరిపారు. గల్ఫ్ దేశాలపై దాడులు జరుగుతున్న వైనంపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి భారతీయుల భద్రత, సంక్షే మంపై కూడా చర్చించారు. ఒమాన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్, కువైత్ యువరాజు షేఖ్ సబా, ఖతర్ ఎమిర్ షేఖ్ తమీమ్‌లతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారని అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల బహ్రెయిన్, సౌదీ అరేబియా పాలకులతో కూడా ప్రధాని మోదీ మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఈ దాడులు గల్ఫ్ దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ గల్ఫ్ పౌరులకు అండగా



ఉంటుందని కూడా హామీ ఇచ్చారు. జోర్డాన్ రాజుతో కూడా మాట్లాడిన ప్రధాని మోదీ సంఘీభావాన్ని ప్రకటించారు. యూఏఈ అధ్యక్షుడు, ఇజ్రాయెలీ ప్రధానితో కూడా మాట్లాడి అక్కడి పరిస్థితి గురించి ఆరా తీశారు. పశ్చిమాసియా, గల్ఫ్ దేశాల్లో సుమారు 90 లక్షల మంది భారతీయులు నివసి స్తున్నారు. ఇరాన్‌లో 10 వేల మంది చదువు, ఉద్యోగాల కోసం ఉంటుండగా, ఇజ్రాయెల్‌లో 40 వేల మంది భారతీయులు ఉంటున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియా గగనతలం మీదుగా విమానాల రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయి. దీంతో అనేక మంది భారతీయులు దుబాయ్, దోహా సహా పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. ఈ విషయమై ఆదివారం కేబినెట్ కమిటీ కూడా సమావేశమై చర్చించింది.



# బ్లడ్ మూన్‌ను చూశారా?

ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం కనువిందు చేసింది. చంద్రగ్రహణం సందర్భంగా చందమామ పూర్తి రక్తవర్ణంలో దగదగ మెరిసిపోయింది. భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు.. ఉత్తర అమెరికా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, కాలిఫోర్నియా సంపూర్ణచంద్రగ్రహణం స్పష్టంగా కనిపించింది. ఆయా దేశాల్లో రక్తవర్ణంలో కనువిందు చేసిన చంద్రుడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రగ్రహణం మధ్యా హ్నం 3.20 గంటలు ప్రారంభమవుతుంది. సాయంత్రం 4.34 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. 5.33 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం వీడుతుంది. అయితే 6.47 గంటలకు గ్రహణం వీడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశా ల్లో కనిపించిన ఈ సంపూర్ణ చంద్రగ్రహణం(బ్లడ్ మూన్) మన దేశంలో మాత్రం కొన్ని చోట్ల మాత్రమే కనిపించింది.

# భీకరంగా యుద్ధం

- ఇరాన్ ఆయువుపట్టుపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు
- గల్ఫ్‌దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు
- నంతాజ్ అణు కేంద్రంపై దాడి నిజమేనన్న ఐఏఈఏ




ఇరాన్–ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం భీకరంగా సాగుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు ఇరాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేస్తుండగా.. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన విరుచుకుపడుతోంది. నాలుగో రోజైన మంగళవారం పరిస్థితి భీకరంగా మారింది. ఇరాన్ సైన్యం కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై దాడికి పాల్పడింది. ఈదాడిలో అమెరికాకు చెందిన ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌పై దాడుల మోతమోగిస్తున్నాయి. ఇరాన్ అధ్యక్ష భవనంపైన, ఆ దేశ మిలిటరీ శిక్షణ కేంద్రంపైన, ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యాలయం పైన దాడులకు పాల్పడ్డాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 787 మంది ఇరానీలు మరణించారు. ఇంకా తీవ్రంగా దాడులు కొనసాగుతున్నాయి. దాంతో పశ్చిమాసియాలో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా ఉంది.

### ‘ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి’

ఇరాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులు తీవ్రం చేసింది. ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి చేసినట్టు ప్రకటించింది. “కచ్చితమైన నిఘా సమాచారం ఆధారంగా.. టెహ్రాన్ నడిబొడ్డునున్న కీలక ప్రాంగణంపై దాడులు చేశాం. అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై అనేక బాంబులు జారవిడిచాం. అదేవిధంగా ఇరాన్ సైనికాధికారులకు శిక్షణనిచ్చే సంస్థను, ఇతర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాం” అని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. మరోవైపు.. యుద్ధంపై ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నాదవ్ శోషాని కీలక వ్యాఖ్యలు చేశారు. దాడులు అనేక వారాలపాటు కొనసాగవచ్చనే అంచనాతో తమ సైన్యం సిద్ధమైందన్నారు. అయితే, యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటివరకు యుద్ధంలో సానుకూల పురోగతి సాధించామని ఓ మీడియా సమావేశంలో తెలిపారు. ఇరాన్‌లో భూతలదాడులకు బలగాలను మోహరించే అవకాశం ఉందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. అలాంటిదేమీ లేదని చెప్పారు. ఇప్పటికైతే అటువంటి ఆలోచనలు లేవన్నారు.

### నతాంజ్‌పై దాడి నిజమే: ఐఏఈఏ

అమెరికా–ఇజ్రాయెల్ దాడుల క్రమంలో ఇరాన్‌లోని నతాంజ్ అణుకేంద్రంపైన దాడి జరిగినట్టు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ వెల్లడించింది. అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాల ఆధారంగా, భూగర్భ అణు కేంద్రం ప్రవేశ భవనాలు దెబ్బతిన్నట్టు ధ్రువీకరించింది. అయితే, రేడియేషన్ లీకేజీ ఉండకపోవచ్చని, అణు కేంద్రానికీ పెద్దగా నష్టం లేదని తెలిపింది. గత జూన్‌లో అమెరికా జరిపిన దాడుల్లో ఈభూగర్భ అణు శుద్ధి కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నట్టు వార్తలు వచ్చాయి.

# పాట్రియాట్ వర్సెస్ షాహిద్!



- ఇరువైపులా క్షీణిస్తున్న ఆయుధ బాండాగారం
- అయినా.. కొరత లేదంటోన్న డొనాల్డ్ ట్రంప్
- తక్కువ ఖర్చు షాహిద్‌తో పెద్ద యుద్ధమే చేస్తున్న ఇరాన్
- తరుగుతున్న ఆయుధ సామర్థ్యంపై ఖతార్ ఆందోళన

నాలుగు రోజుల ఇరాన్ సంక్షోభంతో –ఇరువైపులా ఆయుధ సంపత్తి క్షీణిస్తున్నట్టు కథనాలు వస్తున్నాయి. ఎవరి మద్దతు లేకుండానే ఇరాన్ తన డ్రోన్లతో ఇజ్రాయెల్, గల్ఫ్ ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతున్నది. అమెరికా–ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేసినా.. ఈ యుద్ధం ఇప్పట్లో ఆగే రీతిలో లేదన్నది అమెరికా, ఇజ్రాయెలే చెబుతున్నాయి. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలూ గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు. “అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి” అని తన పోస్టులో పేర్కొన్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్టు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

అయితే, ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ తన డ్రోన్ సామర్థ్యాన్ని ప్రయోగిస్తోంది. దాదాపు అన్ని గల్ఫ్ దేశాలపై డ్రోన్లను వదలడంతో.. అమెరికా మిత్ర దేశాలవద్దనున్న పాట్రియాట్ మిస్సైళ్లు ఆ డ్రోన్లను ఎదుర్కొనే పనిలోపడ్డాయి. అయితే ఏకధాటిగా ఆయుధాలు వాడటంవల్ల .. ఎవరు ముందుగా తమ ఆయుధ సంపత్తిని కోల్పోతారన్న అనుమానాలు మొదలయ్యాయి. ఇరాన్ తన షాహిద్–136 డ్రోన్లతో.. పశ్చిమాసియా దేశాల్లో కొంత అలజడి సృష్టించగలిగింది. అన్ని అమెరికా బేస్‌లు, ఇంధన కారాగారాలు, నివాస స్థలాలపై డ్రోన్లతో ఇరాన్ అటాక్ చేసింది. అమెరికా, ఇజ్రాయల్ దళాలు తమ దాడుల కోసం క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లు, ప్రిసిషన్ గైడెడ్ బాంబులను వినియోగిస్తున్నాయి. వాస్తవానికి అమెరికా తయారీకి చెందిన పాట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ క్షిపణులు చాలావరకు ఇరాన్ షాహిద్ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోగలిగాయి. సుమారు 90శాతం వరకు పాట్రియేట్ క్షిపణులు ఇరాన్ డ్రోన్లను చిత్తుచేసినట్టు యూఏఈ చెప్పింది. అయితే 4 మిలియన్ల డాలర్లు ఖర్చయ్యే పాట్రియేట్ మిస్సైల్‌తో .. 20 వేల డాలర్లకే తయారయ్యే డ్రోన్‌ను కూల్చడం సమస్యగా మారింది. తక్కువ ఖర్చుతో తయారైన షాహిద్ డ్రోన్లు పెద్దపెద్ద యుద్ధాల్లో పెను సవాల్‌గా మారినట్టు డిఫెన్స్ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం పోరాటం సాగుతున్న తీరు గమనిస్తే, అమెరికా.. ఇరాన్ త్వరలోనే తమ ఆయుధ నిల్వల్ని కోల్పోయే అవకాశముంది. ప్రస్తుతం ఖతార్ వద్దనున్న పాట్రియాట్ ఇంటర్‌సెప్టార్ క్షిపణుల స్టాక్స్ వేగంగా కరిగిపోతున్నాయి. ఈ సంక్షోభానికి ముగింపు పలకాలని దోహా అగ్రరాజ్యాన్ని ఇప్పటికే కోరుతున్నది. గత ఏడాది ఇజ్రాయల్‌తో యుద్ధం జరిగిన తర్వాత ఇరాన్ సుమారు రెండువేల బాలిస్టిక్ క్షిపణులను పోగుచేసుకున్నట్టు భావిస్తున్నారు. ఇక షాహిద్ డ్రోన్లు అంతకుమించిన సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. ఆ డ్రోన్లను రష్యా ఉత్పత్తి చేస్తున్నది. ప్రతి రోజు కొన్ని వందల సంఖ్యలో ఆ డ్రోన్ల ఉత్పత్తి జరుగుతున్నట్టు డిఫెన్స్ నిపుణులు బెకా వేసర్ తెలిపారు.

తాజా ఫైట్‌లో ఇప్పటి వరకు టెహ్రాన్ సుమారు 1200 ప్రొజెక్టైల్స్‌ను ఫైర్ చేసినట్లు అంచనా వేస్తున్నారు. దీంట్లో ఎక్కువ శాతం షాహిద్ డ్రోన్లు ఉన్నాయి. ఈ ఎత్తుగడ ద్వారా ప్రమాదకరమైన బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ తన అమ్ములపొదిలో దాచుకుంటున్నట్టు అనుమానిస్తున్నారు. వాటిని చివరి దశలో వినియోగించే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అయితే ట్రంప్ చెప్పినట్లు రాబోయే నాలుగు వారాలకు కావాల్సిన ఆయుధాలను అమెరికా సమీకరించుకున్నట్టు తెలుస్తోంది. ఇక –లాక్‌హీడ్ కంపెనీకి చెందిన థాడ్ అనే అడ్వాన్స్‌డ్ మిస్సైల్ సిస్టమ్‌ను సౌదీ అరేబియా, యూఈఏ ప్రస్తుతం వాడుతున్నాయి. అయితే ఈ క్షిపణి ఖరీదు కూడా ఎక్కువే. థాడ్‌లో వాడే క్షిపణి ఖర్చు సుమారు 12 మిలియన్ల డాలర్లు ఉంటుంది. ఇక్కడ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ను కూల్చేందుకు ఎక్కువ ఖర్చు ఉన్న క్షిపణి వాడాల్సి వస్తున్నది. ఎవరు ఎన్ని ఆయుధాలు సమకూర్చుకోగలిగితే, వార్ అన్ని రోజులు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.





## ఇరాన్‌లో భూకంపం

ఇజ్రాయెల్–అమెరికాతో యుద్ధం కొనసాగుతోన్న వేళ.. ఇరాన్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 4.3గా నమోదైంది. దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో ప్రకంపనలు సంభవించాయి. ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా చేపట్టిన సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. 24 గంటల్లో ఇరాన్‌పై భీకరదాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం తెలిసిందే.

## సామూహిక సమాధులు తవ్వుతున్నాం: ఇరాన్ ఆవేదన



ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తమ దేశంలోని పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్– అమెరికా తొలి దాడుల్లో.. మినాబ్ నగరంలోని ప్రాథమిక పాఠశాలలో 160కి పైగా విద్యార్థినులు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. వారికోసం సామూహిక సమాధులు తవ్వుతున్న దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం యుద్ధ నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక చిన్నారులను అతి దారుణంగా హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ ప్రజలపై ట్రంప్ చేసిన దాడులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇరాన్‌పై ఇప్పటి వరకు అమెరికా–ఇజ్రాయెల్ చేసిన సంయుక్త దాడుల్లో 787మంది మృతి చెందారు.

## ‘ఇజ్రాయెల్‌లో అమెరికన్ల భద్రతకు గ్యారెంటీ ఇవ్వలేం’



ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. అక్కడున్న తమ పౌరులను ఉద్దేశించి జెరుసలెంలోని అమెరికా రాయబార కార్యాలయం కీలక పోస్టు పెట్టింది. తదుపరి నోటీసు వచ్చేవరకు యూఎస్ ప్రభుత్వోద్యోగులు, కుటుంబసభ్యులు అక్కడే ఉండాలని ఆదేశించింది. “ఈ క్లిష్ట సమయంలో ఇజ్రాయెల్‌లో ఉంటున్న అమెరికన్లను తరలించే స్థితిలో ఎంబసీ లేదు” అని వెల్లడించింది. ఈజిప్టులోకి వెళ్లడానికి ఉపయోగించే టాబా బోర్డర్ క్రాసింగ్ వద్దకు చేరుకునేందుకు ఇజ్రాయెల్ రవాణా సదుపాయాలను ఏర్పాటుచేసింది. అక్కడకు వెళ్లాలంటే ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని ఎంబసీ వెల్లడించింది. అయితే ఆ మార్గంలోనే వెళ్లాలనుకుంటే.. భద్రతకు ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేమని స్పష్టం చేసింది.

# జాతీయ గీతాన్ని ఆలపించడానికి నిరాకరించిన ఇరాన్ ఫుట్‌బాల్ ప్లేయర్లు

అంతర్జాతీయ వేదికపై ఇరాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళల ఆసియా కప్ ప్రారంభ మ్యాచ్‌కు ముందు మైదానంలో జాతీయ గీతం ఆలపించే సమ యంలో ఇరాన్ ప్లేయర్లు మౌనంగా ఉండిపోయారు. అమెరికా జరిపిన దాడుల్లో ఇటీవలే ఇరాన్ సుప్రీం లీడన్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన మృతికి నిరసనగా ప్లేయర్లు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ వేదికగా దక్షిణ కొరియాతో ఇరాన్ తలపడింది. ఈ మ్యాచ్‌కు ముందు ప్లేయర్లంతా మైదానంలో వరుసగా నిలబడ్డారు. ఇరాన్ జాతీయ గీతం ప్రసారం అయింది. కానీ జట్టు సభ్యులతో పాటు ప్రధాన కోచ్ మార్జియే జాఫరీ కూడా గీతాన్ని ఆలపించకుండా మౌనంగా నిలబడ్డారు. ఎటువంటి చలనం లేకుండా తమ నిరసనను వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో ఇరాన్ కెప్టెన్ జహ్రా ఘన్బారి, కోచ్ జాఫరి ని ఖమేనీ మరణంపై ప్రశ్నించగా.. ఏఎఫ్‌సీ ప్రతినిధి వెంటనే జోక్యం చేసుకుని 'ఈ ప్రశ్నలు ఇక చాలు.. గేమ్‌పైనే దృష్టి పెట్టండి' అని సమాధానం ఇచ్చారు.

**మ్యాచ్ విషయానికొస్తే..**

ఆసియాలోనే అత్యంత బలమైన జట్లలో ఒకటైన దక్షిణ కొరియాపై ఇరాన్ ఓటమి పాలైంది. కొరియా ప్లేయర్ చో యు-రి తొలి అర్ధ భాగంలో గోల్ చేయగా.. విరామం తర్వాత కిమ్ హ్యెరి, కోయో జిన్ చెరో గోల్ సాధించి దక్షిణ కొరియాకు విజయాన్ని అందించారు. ఓటమి ఎదురైనా ఇరాన్ కోచ్ జాఫరీ తన జట్టు ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేశారు. 'కొరియా ఆసియాలోనే బలమైన జట్టు. మాకు ఇది సవాలుతో కూడుకున్న మ్యాచ్ అని ముందే తెలుసు. రెండో అర్ధ భాగంలో మా వ్యూహాన్ని మార్చి ఒత్తిడి పెంచాం. అయితే పెనాల్టీ విషయంలో జరిగిన పొరపాటుతో మూల్యం చెల్లించుకున్నాం. అయినప్పటికీ మా జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడింది' అని పేర్కొన్నారు.

❑ ఖమేనీ మృతికి నిరసనగా మౌనం





## సెమీస్‌కు మ్యాచ్ రెఫరీలు వీరే!

టీ20 ప్రపంచ కప్ 2026 ముగింపు దశకు చేరుకుంది. ఇప్పటికే సూపర్ 8 దశ నుంచి నాలుగు జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. మార్చి 4, 5 తేదీల్లో సెమీస్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 4న బుధవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. మార్చి 5న గురువారం ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ఇంగ్లండ్-భారత్ పోటీ పడనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లకు సంబంధించి మ్యాచ్ రెఫరీలు, అంపైర్లుగా ఎవరు వ్యవహరించ నున్నారో తాజాగా ఐసీసీ వెల్లడించింది. జవగల్ శ్రీనాథ్, ఆండీ పైక్రాఫ్ట్‌లను మ్యాచ్‌లకు రెఫరీలుగా నియమించింది. ఈడెన్ గార్డెన్స్‌లో సౌతాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న తొలి సెమీఫైనల్ మ్యాచ్‌కు శ్రీనాథ్ రెఫరీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా రిచర్డ్ ఇల్లింగ్ వర్త్, అలెక్స్ వార్ఫ్ వ్యవహరించనున్నారు నితిన్ మీనన్ థర్డ్ అంపైర్, రాడ్ టక్కర్ నాలుగో అంపైర్‌గా నియమితులయ్యారు. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ఇంగ్లండ్-భారత్ మధ్య జరగనున్న రెండో సెమీ ఫైనల్ కు పైక్రాఫ్ట్ రెఫరీగా వ్యవహరించనున్నారు. క్రిస్ గఫానీ, అల్లాహుద్దీన్ పాలేకర్ ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా విధులు నిర్వహించనున్నారు. ఆడ్రియన్ హోల్డ్‌స్టాక్ థర్డ్ అంపైర్, పాల్ రీఫెల్ ఫోర్త్ అంపైర్‌గా వ్యవహరించను న్నారు.

## హోరాహోరీ పోరు తప్పదు

**- సునీల్ గవాస్కర్**



పొట్టి ప్రపంచ కప్ 2026లో భాగంగా ఇప్పటికే సూపర్ 8నుంచి నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా-న్యూజిలాండ్, వాంఖడే స్టేడియం వేదికగా ఇంగ్లండ్-భారత్ జట్లు తలపడనున్నాయి. ఈ కీలక పోరుపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా కచ్చితంగా ఫైనల్ వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'భారత క్రికెట్‌లో ఇది కొత్త యుగం.. ఇప్పుడు ఆడేది కొత్త జట్టు. గత రికార్డులను మరిచిపోవాలి. వాంఖడేలో భారత్‌కు సెమీఫైనల్స్‌లో అంత గొప్ప రికార్డు లేదు. కానీ ఈ టోర్నీలో టీమిండియా చరిత్ర సృష్టిస్తుంది. సెమీస్‌లో గెలిచే సామర్థ్యం ప్రతి ఒక్క ప్లేయర్‌లోనూ కనిపిస్తుంది. మరోవైపు ఇంగ్లండ్ జట్టు కూడా చాలా బలంగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్, మిడిల్ ఆర్డర్, ఫినిషర్లు.. అన్నింటిలోనూ ఇరు జట్లు సమానంగా ఉన్నాయి. కాబట్టి ఈ సెమీస్ పోరు అత్యంత రసవత్తరంగా సాగనుంది' అని సన్నీ వెల్లడించాడు. సెమీ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో టీమిం డియాకు సన్నీ కీలక సూచనలు చేశాడు. 'పవర్ ప్లేలో దూకుడుగా ఆడటం అవసరమే. కానీ ప్రతి బంతినీ బౌండరీ బాదాల్సిన అవసరం లేదు. పరిస్థితులకు అనుగుణంగా గేర్ మార్చాలి. మొదట కాస్త క్రీజులో కుదుర్కొని ఆపై దూకుడు పెంచాలి. ఎప్పుడూ అటాకింగ్ మోడ్‌లో ఉండాల్సిన అవసరం లేదు. ఒక్క చిన్న తప్పిదం మ్యాచ్‌ను మలుపు తిప్పేస్తుంది' అని పేర్కొన్నాడు.

## భారత్‌లో చిక్కుకున్న వెస్టిండీస్, జింబాబ్వే

టీ20 ప్రపంచ కప్ 2026 సూపర్-8లో భారత్ చేతిలో వెస్టిండీస్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ పరాజయంతో విండీస్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో స్వదేశానికి బయలుదేరాల్సి ఉంది. అయితే అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం కారణంగా వారి ప్రయాణం మరింత ఆలస్యం కానుంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్న కారణంగా అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. దీంతో ఆటగాళ్ల ప్రయాణ భద్రత కోసం తాము ఐసీసీ, సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది.

'గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రయాణ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీంతో అనేక అంతర్జాతీయ విమాన మార్గాలు ప్రభావితమయ్యాయి. భద్రత కారణాల దృష్ట్యా విమాన సంస్థలు ముందుగా షెడ్యూలు చేసిన సర్వీసులను రద్దు చేశాయి. స్వదేశా నికి ఆలస్యంగా చేరుకున్న.. ఆటగాళ్ల భద్రతే తమకు ముఖ్యం' అని వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. అలానే జింబాంబ్వే క్రికెట్ బోర్డుకు కూడా ఓ ప్రకటన విడుదల చేసింది.'

మా క్రికెట్ జట్టు దుబాయ్ ద్వారా స్వదేశానికి తిరిగి రావాల్సి ఉంది. కానీ పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా మా జట్టు ఆటగాళ్ల ప్రయాణ ప్రణాళికలు ప్రభావిత మయ్యాయి' అని తెలిపింది. ప్రస్తుతం జింబాంబ్వే క్రికెట్ జట్టు ఢిల్లీలో ఉన్నట్లు సమాచారం. వెస్టిండీస్, జింబాంబ్వే జట్లు పశ్చిమాసియా ప్రాంతమైన దుబాయ్ మీదుగా తమ దేశాలకు చేరు కోవాల్సి ఉంటుంది. అయితే ఇరాన్ ప్రతిదాడి వల్ల దుబాయ్ అంత ర్జాతీయ విమానాశ్రయానికి నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. టీ20 ప్రపంచకప్ 2026లో తమ చివరి మ్యాచ్ జింబాబ్వే.. సౌతాఫ్రికా చేతిలో ఓడిన సంగతి తెలిసిందే.



## సురక్షితంగా భారత్ చేరుకున్న పీవీ సింధు



గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. అక్కడ భయం భయంగా ఉందంటూ ఆమె సోషల్ మీడియాలో ద్వారా వెల్లడించారు. ఎట్టకేలకు యుద్ధం మధ్య పీవీ సింధు సురక్షితంగా భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె దుబాయ్ నుంచి బయలుదేరి బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. తాను సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నానని తెలిపారు. దుబాయ్‌లో గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నానని, ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగానని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో తమను సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేనని అన్నారు. కష్ట కాలంలో తనకు సాయపడిన వారందరికీ పీవీ సింధు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తాను విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని, రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తానని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. పీవీ సింధు ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరింది. దుబాయ్ మీదుగా వెళ్లే క్రమంలో అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం కారణంగా అక్కడి విమానాశ్రయంలో సింధు చిక్కుకున్నారు.

### ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్..

## అగ్రస్థానంలో స్మృతి మంధాన



టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కిం చుకుంది. తాజాగా ఐసీసీ విడుదల చేసిన జాబితాలో 790 పాయింట్లతో టాప్ స్పాట్‌లో నిలిచింది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో స్మృతి ఓ హాఫ్ సెంచరీ నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్(780)ను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. వన్డే సిరీస్‌లో భారత్‌పై సెంచరీలు సాధించిన బెత్ మూనీ (749), అలీసా హీలీ(744) పైకి దూసుకొచ్చి ఆ తర్వాతి స్థానా ల్లో కొనసాగుతున్నారు. టీమిండియా బ్యాటర్లలో కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(652) 9వ స్థానంలో ఉండగా.. జెమీమా రోడ్రిగ్స్ (635) 12వ స్థానానికి పరిమితమైంది. ఇక బౌలింగ్ ర్యాంకిం గ్స్ జాబితా విషయానికొస్తే.. ఇటీవల ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న స్టార్ బౌలర్ దీప్తి శర్మ(614) పదో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా ప్లేయర్ అలానా కింగ్(775) అగ్రస్థా నంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో సోఫీ ఎకిల్‌స్టన్ (747), ఆష్లీ గార్డ్‌నర్(713) కొనసాగుతున్నారు. మహిళల టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో బెత్ మూనీ 787 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. స్మృతి మంధాన 770 పాయిం

# నై నై అన్నా... రై రై అన్నాడు

‘పెద్ది’ సినిమాలోని తొలి పాట ‘చికిరి చికిరి’కి రికార్డు స్థాయిలో వ్యూస్ దక్కాయి. అందులోని హుక్‌స్టెప్ సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది. ఇటీవల విడుదలైన రెండో పాట ‘రై రై రారా’ కూడా అదే జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే నెటిజన్లు ఈ సాంగ్‌కు సంబంధించిన రీల్స్‌తో సందడి చేస్తున్నారు. కేవలం తెలుగు లిరికల్ వీడియోకే యూట్యూబ్లో ఇప్పటిదాకా 17మిలియన్ వ్యూస్ రావడం విశేషం. ఈ విజయం వెనుక దాగిన కష్టాన్ని చిత్ర దర్శకుడు బుచ్చిబాబు మీడియాతో పంచుకున్నారు. ‘ఈ పాట షూటింగ్ సమయానికి రామ్‌చరణ్‌కు తీవ్ర జ్వరం ఉంది. షూటిం గ్ ఆపేద్దామని చెప్పినా ఆయన వినలే’ దన్నారు. తెలిపారు. పాట బాగుందంటూ చిరంజీవి పెట్టిన పోస్టుకు బుచ్చిబాబు బదులిస్తూ.. షూటింగ్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

“ఆ రోజు ఇంకా గుర్తుంది సర్. ఈ బీజీఎం (పాటలోని నేపథ్య సంగీతం) షూటింగ్ చేస్తున్నప్పుడు చరణ్‌కు తీవ్ర జ్వరం. మేం షూటింగ్ ఆపేద్దామన్నా.. ఆయన ‘లేదు చేద్దాం’ అని అన్నారు. అంత జ్వరంలోనూ చిరునవ్వుతో, ఎంతో గ్రేస్తో డ్యాన్స్ చేశారు. ఆ డెడికేషన్ అన్నీమీ నుంచి వచ్చినవే సర్” అని బుచ్చిబాబు పేర్కొన్నారు.



## చరణ్ డ్యాన్స్ గర్వకారణం: చిరంజీవి

‘రై రై రారా’ సాంగ్ స్క్రీన్‌ప్లే ఓ ఫైర్లా ఉందంటూ చిరంజీవి పోస్టు పెట్టారు. అది ఎనర్జీ, ఎమోషన్లతో కూడిన అద్భుతమని కొనియాడారు. చరణ్ గ్రేస్, డ్యాన్స్‌లో వేగం చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, గేయ రచయిత అనంత్‌శ్రీరామ్, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, దర్శకుడు బుచ్చిబాబు, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, నిర్మాత వెంకట సతీశ్ కిలారులను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తరాంధ్ర నేపథ్యంతో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది.

# కొత్త ఇంట్లో... క్రేజీ జోడీ



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న.. భార్యాభర్తలుగా తమ కొత్త ప్రయాణాన్ని అత్యంత స్వచ్ఛంగా ప్రారంభించారు. డెస్టినేషన్ వెడ్డింగ్ తర్వాత ఈ క్రేజీ జోడీ నేరుగా తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని తుమ్మన్‌పేట గ్రామానికి చేరుకుంది. పెళ్లయ్యాక రష్మికను తొలిసారిగా తన సొంతూరికి తీసుకొచ్చిన రౌడీ బాయ్.. అక్కడున్న తన ఫామ్ హౌస్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు.

పాన్ ఇండియా లెవెల్లో స్టార్ డమ్ ఎంజాయ్ చేస్తున్నప్పటికీ విజయ్ తన మూలాలను ఎన్నడూ మర్చిపోలేదు. తాను పుట్టి పెరిగిన తుమ్మన్‌పేట అంటే ఆయనకు ప్రాణం. అందుకే జీవితంలో ఎంతో ముఖ్యమైన పెళ్లి తర్వాత జరిగే తొలి పూజా కార్యక్రమాలను హైదరాబాద్ లాంటి మహానగరంలో కాకుండా తన మట్టిపైనే తన ఊరి ప్రజల మధ్యే జరుపుకోవాలని ఫిక్స్ అయ్యారు. ఈ వ్రతానికి ఆయన చిన్ననాటి స్నేహితులు, అత్యంత సన్నిహిత కుటుంబ సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ వ్రతానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నెటిజన్లు ముద్దుగా పిలుచుకునే ‘విరోష్’ జంట ట్రెడిషనల్ లుక్స్‌లో అదరగొడుతున్నారు. తమ పెళ్లి వేడుకల ప్లానింగ్‌ను అభిమానులకు కనెక్ట్ అయ్యేలా డిజైన్ చేసుకున్న ఈ జంట.. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాన్స్‌కు స్వీట్ బాక్సులు పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

దేశం నలుమూలల నుంచి అభిమానుల ఆశీస్సులు అందుకున్న ఈ జంట.. ఇప్పుడు సొంత ఊరిలో పెద్దల దీవెనలు తీసుకోవడం అందరి మనసులను గెలుచుకుంటోంది. సత్యనారాయణ స్వామి వ్రతం కోసం తుమ్మన్‌పేటలోని విజయ్ ఫామ్ హౌస్‌ను అచ్చమైన పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా సంప్రదాయబద్ధంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమం కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య చాలా ప్రైవేట్‌గా జరిగినప్పటికీ.. బయట మాత్రం వాతావరణం పండుగలా మారి పోయింది. విజయ్, రష్మికలను చూడ్డానికి ఫ్యాన్స్ పోటెత్తడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేసి పరిస్థితిని కంట్రోల్ చేశారు. ముఖ్యంగా ఆయన ఫామ్ హౌజ్ మూడు అంతస్తులతో మామూలుగా లేదు. డ్రోన్ షాట్స్‌లో చూస్తుంటే ఇంద్రభవనం కూడా తక్కువే అనిపిస్తోంది.



# అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ రిసెప్షన్

## ఎవరెవరు వచ్చారంటే..

టాలీవుడ్‌లో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఇప్పటికే లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ-రష్మిక మందన్నా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ సైతం వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే అల్లు వారి ఇంట పెళ్లి సందడి మొదలైంది. అల్లు శిరీష్, నయనిక పెళ్లి వేడుక మార్చి 6న జరగనుంది. ఈ క్రమంలోనే ప్రీ వెడ్డింగ్ వేడుకను ఏర్పాటు చేశారు. అల్లు స్టూడియోలో ఘనంగా జరిగిన ఈ వేడుకకు టాలీవుడ్ సినీ ప్రముఖులంతా హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. అక్కినేని ఫ్యామిలీ, నందమూరి ఫ్యామిలీ, మెగా ఫ్యామిలీ సందడి చేశాయి. అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అమల హాజరు కాగా అల్లు అరవింద్ ఆప్యాయంగా ఆహ్వానించారు. రామ్‌చరణ్, సురేఖ కొణిదెల, సుస్మిత, నాగబాబు, సాయిధరమ్‌తేజ్, వైష్ణవ్‌తేజ్ కూడా వచ్చారు. నందమూరి బాలకృష్ణ, మంచు మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్, సందీప్‌రెడ్డి వంగా, డైరెక్టర్ అట్లీ, మలయాళీ నటుడు బాసిల్ జోసేఫ్ వంటి ప్రముఖులతో పాటు సీనియర్ నటీనటులు, దర్శకులు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండ రామిరెడ్డి, సి.అశ్వనీదత్, దగ్గుబాటి సురేష్‌బాబు, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, డీవీవీ దానయ్య కాబోయే జంటను ఆశీర్వదించారు. నేచురల్ స్టార్ నాని, తన భార్య అంజుతో కలిసి కనిపించారు.



# మతిపోయేలా...

భాగ్యశ్రీ బోర్సే గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతో ప్రేక్షకుల గుండెల్ని కొల్లగొడుతున్న ఈ అమ్మడు ఓవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. అందులో భాగంగా తాజాగా కొన్ని ఫొటోలను నెట్టింట షేర్ చేసింది. వీటిల్లో ఆమె బాడీ హగ్గింగ్ డ్రెస్‌లో తన ఫిజిక్ ఎలివేట్ అయ్యేలా దిగిన ఫొటోలు యూత్ మతులు పోగొడుతున్నాయి. నెటిజన్లు ఆ ఫొటోలకు లైకుల వర్షం కురిపిస్తూ వాటిని నెట్టింట వైరల్ చేస్తున్నారు.

# శ్రీలీల... క్రీడా చిత్రంలో!



“నువ్వు నా వాడివి.. నువ్వే నా ప్రతి ఆనందానివి”అంటూ ఇంకా పేరు ఖరారు కానీ ఓ సినిమాతో అలరించడానికి ముస్తాబవుతున్నారు బాలీవుడ్ కథా నాయకుడు కార్తిక్ ఆర్యన్, శ్రీలీల. ఇంకా ఈచిత్రం విడుదలకాక ముందే..ఈ జంట ఇప్పుడు మరో సినిమా కోసం జోడీకట్టడానికి సిద్ధమైంది. ‘చందు ఛాంపియన్’ దర్శకుడు కబీర్ ఖాన్తో కార్తిక్ ఓ సినిమా కోసం చేతులు కలిపి నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథా నాయికగా శ్రీలీలను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్ర బృందం.

“స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కార్తిక్ కిక్ బాక్సింగ్ కోచ్‌పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన నటించడానికి శ్రీలీలతో చర్చలు జరుపుతున్నారు. నిజ జీవితాధారంగా రూపొందుతున్న ఈచిత్రంలోని తన పాత్ర కోసం కార్తిక్ శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైన ఈ చిత్రం2027లో థియేటర్లలోకి వచ్చే అవకాశముంద”ని శ్రీలీల సన్నిహిత వర్గాలు తెలిపాయి.మరి తన స్టెప్పులతో అదరగొట్టే ఈమె.. మరోసారి కార్తిక్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

# సలార్-2... త్వరలోనే షూటింగ్

ప్రభాస్ కథా నాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన ఎపిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘సలార్‌శ్రీ: సీజ్ ఫైర్’. దీనికి సీక్వెల్‌గా ‘శౌర్యాంగ పర్వం’ రానున్న విషయం తెలిసిందే. తాజాగా నిర్మాత విజయ్ కిరగందూర్ ఓ ఇంటర్వ్యూలో దీని గురించి ప్రస్తావించారు. “సలార్-2 అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. దీని అప్డేట్స్ కోసం వరుసగా అభిమానులు పోస్టులు పెడుతూనే ఉన్నారు. అవి మా దృష్టికి కూడా వచ్చాయి. త్వరలోనే దీని షూటింగ్ ప్రారంభిస్తాం. ఈ విషయం మీ అందరితో పంచుకోవడం ఆనందంగా ఉంది” అన్నారు.

